ప్రజాశక్తి

విశాఖ

ఆదివారం
జనవరి 7,
2018



బహిరంగసభలో మాట్లాడుతున్న సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత

రసాయన పరిశ్రమలతో
దెబ్బతింటున్న మత్స్యకారుల ఉపాధి

సిపిఎం బహిరంగ సభలో హేమలత

ప్రజాశక్తి-విశాఖపట్నం ప్రతినిధి

తీరప్రాంతంలో పరిశ్రమలు విడుదల చేస్తున్న కాలుష్యంతో మత్స్యకారుల జీవనోపాధి దెబ్బతింటోందని సిపిఎం కేంద్ర కమిటీ సభ్యులు డాక్టర్ కె. హేమలత అన్నారు. సముద్రంలో చేపల సంపద తగ్గిపోవడంతో మత్స్యకారులు ఉపాధి కోల్పోతున్నారని ఆందోళన వ్యక్తం చేశారు. సిపిఎం 22వ మహాసభల సందర్భంగా అచ్యుతాపురం జంక్షన్లో పార్టీ జిల్లా కార్యదర్శి కె.లోకనాథం అధ్యక్షతన జరిగిన బహిరంగసభలో మిగతా 4లో..

నిర్లక్ష్యంపై కేసు



రమణమూర్తి, సోషల్ వెల్ఫేర్ డిడి



ప్రవీణ్‌కుమార్, జిల్లా కలెక్టర్

- ఇద్దరు జిల్లా అధికారులపై అట్రాసిటీ కేసు
- ఎ1గా డిడి, ఎ2గా జిల్లా కలెక్టర్
- సెక్షన్ల మార్పుతో పాటు ఆలస్యంపై ప్రత్యేక కోర్టు మండిపాటు
- హైకోర్టును ఆశ్రయించనున్న కలెక్టర్ ప్రవీణ్‌కుమార్

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి, జిల్లా పరిషత్తు

అధికారుల నిర్లక్ష్యం కారణంగా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ బాధితురాలకు ప్రభుత్వం నుంచి రావాల్సిన పరిహారం రావడంలో ఆలస్యం జరిగింది. ఆలస్యానికి కారణమైన సాంఘిక సంక్షేమ శాఖ ఉపసంచాలకులు డి.వి.రమణమూర్తి, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌లను బాధ్యులను చేస్తూ బాధితరాలు కోర్టును ఆశ్రయించింది. ఈ విషయాన్ని తీవ్రంగా పరిగణించిన కోర్టు ఇద్దరు అధికారులపై కేసులు నమోదు చేయాలని పోలీసులకు ఆదేశించింది. దీంతో ఎంవిపి పోలీసులు ఈ నెల 3న ఇద్దరు అధికారులపై అట్రాసిటీ కేసులు నమోదు చేశారు.

నగరానికి చెందిన దళిత యువతి 2016లో ఒక యువకుని చేతిలో మోసపోయింది. ఈ క్రమంలోనే సదరు యువతి తాను ప్రేమ పేరిట మోసిపోయాననీ, తనకు ప్రభుత్వం సాయం చేయాలని అర్జీ పెట్టుకుంది. నిబంధనలు ప్రకారం మోసపోయిన దళిత, గిరిజన యువతులకు ప్రభుత్వం కేవలం మూడు రోజుల వ్యవధిలోనే తక్షణ ఆర్థికసాయం అందజేయాలి. ఈ మేరకు బాధితురాలికి ప్రభుత్వం నుంచి రూ. 3.75 లక్షల ఆర్థిక సాయం అందాల్సి ఉంది. దాని కోసం ఆమె మిగతా 4లో..

ఆలస్యం చేయలేదు..

2016లో ఎంవిపి పోలీస్‌స్టేషన్‌లో బాధిత ఎస్‌టి మహిళ అట్రాసిటీ కేసు పెట్టారు. పోలీసుల నమోదు చేసిన కేసు సెక్షన్ల ఆధారంగా ప్రతి సందర్భంలోనూ అందుకు తగ్గట్టుగా స్పందించడం జరిగింది. రెండు విడతల్లో రూ.3,75,000 బాధితురాలికి పరిహారం చెల్లించాం. మొదట విడత సెప్టెంబర్ 2016లో రూ.25వేలు, డిసెంబర్‌లో రూ.3,50,000 ఇచ్చాం. నిబంధనల ప్రకారమే పరిహారం అందించాం. ఎక్కడా ఆలస్యం చేయలేదు.

– డి.వి.రమణమూర్తి, ఉప సంచాలకులు, సాంఘిక సంక్షేమశాఖ



వికెట్ల మధ్య పరుగులు తీస్తున్న క్రికెటర్లు

రసవత్తరంగా సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ పోటీలు

వార్త 12లో..

డిసిఐ ప్రయివేటీకరణ నిలిపివేయకుంటే పోరాటం ఉధృతం

సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత

వార్త 12లో..

గీతోపదేశం





హోరాహోరీ పోరులో టెన్నిస్ క్రీడాకారులు

పంజాబ్, ముంబయి, బెంగుళూరు జట్లు ముందంజ

ప్రజాశక్తి - విశాఖపట్నం

గీతం విశ్వవిద్యాలయం వేదికగా జరుగుతున్న అఖిలభారత స్థాయి అంతర్ విశ్వవిద్యాలయం మహిళా టెన్నిస్ పోటీలలో పంజాబ్, ముంబయి, బెంగళూరు అన్నా యూనివర్సిటీల జట్లు ప్రత్యర్థులపై ఘన విజయం నమోదు చేసి ముందంజలో ఉన్నాయి. శనివారం నాటి ఫలితాలను నిర్వాహక కార్యదర్శి కె.రామకృష్ణారావు తెలియజేశారు. ఢిల్లీ విశ్వవిద్యాలయంపై బెంగళూరు విశ్వవిద్యాలయం జట్టు 2-0 స్కోరుతోనూ, బిలాస్‌పూర్ విశ్వవిద్యాలయం జట్టుపై ముంబయి విశ్వవిద్యా లయం జట్టు 2-0 స్కోరుతోనూ విజయం సాధించాయి. దుర్గ్ యూనివర్సిటీ జట్టుపై ఎస్‌పి.యూనివర్సిటీ జట్టు 2-0 స్కోరుతోనూ, ముజాఫర్ బిఆర్ఎబి విశ్వ విద్యాలయం జట్టుపై రోతక్ ఎమ్‌డి విశ్వవిద్యాలయం జట్టు 2-0 స్కోరుతోనూ, పంజాబ్ యూనివర్సిటీ జట్టుపై చెన్నై అన్నా విశ్వవిద్యాలయం జట్టు 2-1 స్కోరుతోనూ గెలుపొందాయి. రాయిపూర్ ఆర్ఎస్‌లు జట్టుకు పాటియాల పంజాబ్ యూనివర్సిటీ జట్టును మధ్య జరగాల్సిన పోటీలో రాయ్‌పూర్ జట్టు పాల్గొనక పోవడంతో పంజాబ్ జట్టుకు వాకోవర్ విజయం లభించింది. మరో పోటీలో ప్రత్యర్థి గుజరాత్ విశ్వవిద్యాలయం జట్టు హాజరు కాకపోవడంతో ఎస్ఆర్ఎమ్ జట్టుకు వాకోవర్ విజయం సాధించింది.

అంతర్జాతీయ వాణిజ్యంలో గీతం అడ్మిషన్లు

విశాఖపట్నం: గీతం డిమ్డ్ విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం స్కూల్ ఆఫ్ ఇంటర్నేషనల్ బిజినెస్ (జిఎస్ఐబి)లో 2017-18 విద్యా సంవత్సరానికి గాను ఎంబిఎలో ఇంటర్నేషనల్ బిజినెస్, గ్లోబల్ లాజిస్టిక్స్ అండ్ సప్లై చైన్ మేనేజ్‌మెంట్, ఇంటర్నేషనల్ బ్యాంకింగ్ అండ్ ఫైనాన్స్ స్పెషలైజేషన్‌లకు అడ్మిషన్లు నిర్వహిస్తున్నట్లు జిఎస్ఐబి జాయింట్ డైరెక్టర్ ప్రొఫెసర్ కెకె.నారాయణన్ తెలిపారు. వీటితో పాటు అపార ఉపాధి అవకాశాలు గల బిజినెస్ అనలటిక్స్‌లో ప్రఖ్యాత ఐటి సంస్థ ఐబిఎమ్‌తో కలసి పీజీ డిప్లమా కోర్సును నిర్వహిస్తున్నామన్నారు. ఈ కోర్సులలో ప్రవేశం పొందగోరే వారు ఏదైనా డిగ్రీలో ద్వితీయ శ్రేణి మార్కులతో ఉత్తీర్ణత సాధించిన వారై ఉండాలన్నారు. బిజినెస్ అనలటిక్స్ పీజీ డిప్లమా కోర్సులో ప్రవేశం పొందగోరే వారికి రాత పరీక్ష ఆధారంగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. రాత పరీక్ష అనంతరం గ్రూప్ డిస్కషన్, వ్యక్తిగత ఇంటర్వ్యూ ఉంటుందన్నారు. పైఅర్హతలతో పాటు జాతీయ స్థాయి ప్రవేశ పరీక్షలు అయిన క్యాట్, మ్యాట్, జీమాట్, సీమాట్, ఎక్స్‌ఎటి లలో ర్యాంకు సాధించిన వారికి నేరుగా ప్రవేశాలు కల్పిస్తామన్నారు. పూర్తి వివరాలను గీతం వెబ్‌సైట్ www.gsib.org నుంచి పొందవచ్చని తెలిపారు.

ఎన్నికల వ్యవస్థలపై అవగాహనకు పోటీలు: డిఆర్ఒ

జిల్లా పరిషత్: జనవరి 25న ఓటర్ల దినోత్సవాన్ని పురస్కరించుకుని విద్యార్థులకు ఎన్నికల వ్యవస్థపై అవగాహన కలిగించేందుకు వివిధ పోటీలు నిర్వహించనున్నట్లు జిల్లా రెవెన్యూ అధికారి చంద్రశేఖరరెడ్డి తెలిపారు. శనివారం కలెక్టరేట్‌లోని తన చాంబర్‌లో నిర్వహణ కమిటీలతో సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ పోటీలను జూనియర్, సీనియర్ విభాగాల్లో వేర్వేరుగా నిర్వహించాలన్నారు. నియోజకవర్గం స్థాయిలో జనవరి 18న, జిల్లా స్థాయిలో 21న పోటీలు నిర్వహిస్తామన్నారు. ఇందులో ప్రథమ స్థానంలో నిలిచిన వారిని రాష్ట్రస్థాయి పోటీలకు పంపడం జరుగుతుందన్నారు. నియోజకవర్గ స్థాయిలో జూనియర్స్‌కు బాధ్యత గల ఓటరుగా ఎలా ఉండాలి అనే అంశంపైనా, సీనియర్స్‌కు భారత రాజ్యాంగం - యువత పాత్ర అనే అంశంపై పోటీ ఉంటుందన్నారు. జిల్లా స్థాయిలో ఓటరు నమోదు ప్రక్రియ ప్రమాణాలు, ఎన్నికల్లో అసాంఘిక కార్యకలాపాలు అనే అంశంపై ఉంటుందన్నారు. రాష్ట్ర స్థాయిలో వికలాంగులు ప్రత్యేక సమస్యలు ఉన్నవారికి ఎన్నికల్లో పాల్గొనేలా చేయడానికి ఏం చేయాలి. సామరస్యంగా ఎన్నికల నిర్వహణ, జమిలి ఎన్నికల నిర్వహణ వంటి అంశాలపై పోటీ ఉంటుందన్నారు. ఈ పోటీల్లో ఎక్కువ మంది విద్యార్థులు పాల్గొనేలా విద్యాసంస్థలు, ప్రిన్సిపల్స్, ప్రధానోపాధ్యాయులు అవగాహన కల్పించాలన్నారు. ఈ సమావేశంలో ఎన్నికల సెక్షన్ సూపరింటెండెంట్ మూర్తి, ఇంటర్మీడియట్ బోర్డు ఆర్ఐఒ నగేష్, జిల్లా విద్యాశాఖాధికారి బి.లింగేశ్వరరెడ్డి పాల్గొన్నారు.

నిందితులకే 'బండారు' అండ

బాధిత మహిళను పరామర్శించపోవడంపై దళిత సంఘాల నేతలు ఆగ్రహం



ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

జెర్రిపోతులపాలెంలో దళిత మహిళపై జరిగిన దాడిలో తన వారి ప్రమేయం లేదంటూ పెందుర్తి ఎమ్మెల్యే బండారు సత్యనారాయణమూర్తి చేసిన వ్యాఖ్యలు నిజం కాదని ఆయనే రుజువు చేసుకున్నారు. దేశవ్యాప్తంగా సంచలనం సృష్టించిన దళిత మహిళ వివస్త్ర ఘటనపై టిడిపి, బిజెపి మినహా అన్ని రాజకీయ పార్టీల నేతలు, ప్రజా సంఘాల ప్రతినిధులు బాధితురాలిని పరామర్శించారు. ఓదార్పునిస్తూ అండగా నిలబడ్డారు. స్థానిక ఎమ్మెల్యే బండారు బాధిత మహిళను పరామర్శించలేదు. ఆయన వైఖరి బాధితులకు వ్యతిరేకమన్న అనుమానాలను కలిగించింది. పైగా ఈ నెల 3 వ తేదీన జిల్లా కోర్టుకు వెళ్లి గంటపాటు అక్కడ వేచి ఉండి ఈ ఘటనకు పాల్పడ్డ పెందుర్తి వైస్ ఎంపిపి తదితర నిందితులను పరామర్శించడంతో దాడి వెనుక ఆయన ప్రోద్బలం ఉందని జరుగుతున్న విమర్శలకు బలం చేకూర్చింది. ఎవరికి కష్టమొచ్చినా స్థానిక ఎమ్మెల్యేగా స్పందించాల్సిన ఆయన దళిత మహిళను వివస్త్రను చేసిన దుశ్శాసన పర్వాన్ని ఖండించకపోవడం, నిందితులకు అండగా నిలబడటం ఎవరికైనా ఆశ్చర్యాన్ని కలిగించకమానదు. ఎమ్మెల్యే, ఆయన తనయుడు అప్పలనాయుడు తీరుపై నియోజకవర్గంలోని ప్రజలు ముఖ్యంగా దళితుల్లో తీవ్ర ఆగ్రహావేశాలు పెల్లుబికుతున్నాయి. ఎమ్మెల్యే వైఖరిపై టిడిపి అధిష్టానం కూడా స్పందించకపోవడంపై రాష్ట్రవ్యాప్తంగా చర్చనీయాంశమైంది. ఈ విషయమై ప్రతిపక్ష వైసిపి, సిపిఎం, సిపిఐ పార్టీలు జెర్రిపోతులపాలెంలో బాధిత మహిళను పరామర్శించాయి. కులవివక్ష వ్యతిరేక పోరాట సమితి గ్రామంలో ధర్నా నిర్వహించింది. ఇటీవల వైసిపి నేతలు గుడివాడ అమర్‌నాథ్, మేరుగ నాగార్జున, పెందుర్తి నియోజకవర్గ ఇన్‌ఛార్జి అదీప్‌రాజు ఢిల్లీలోని జాతీయ ఎస్సీ కమిషన్‌ను కలిసి బాధిత మహిళకు న్యాయం చేయాలని, నిందుతులను కఠినంగా శిక్షించాలని డిమాండ్ చేసిన సంగతి తెలిసిందే.

పేదల పక్షాన నిరంతర పోరాటం

సిపిఎం రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు నర్సింగరావు

ప్రజాశక్తి- అచ్యుతాపురం

పేదన పక్షాన నిరంతర పోరాటమే సిపిఎం ధ్యేయమని ఆ పార్టీ రాష్ట్ర కార్యదర్శివర్గ సభ్యులు సిహెచ్ నర్సింగరావు పేర్కొన్నారు. అచ్యుతాపురంలో సిపిఎం జిల్లా మహాసభల సందర్భంగా శనివారం బహిరంగ సభ జరిగింది. ఈ సందర్భంగా ఆయన సభను ఉద్దేశించి మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అధికారం చేపట్టి మూడున్నరేళ్లు గడిచినా ఎక్కడి సమస్యలు అక్కడే ఉన్నాయని తెలిపారు. ప్రమాణ స్వీకారం రోజున పిఎం, సిఎం చేసిన హామీలు నేటికి నెర వేర్చ లేదన్నారు. అరచేతిలో స్వర్గం చూపించి అధికారం చేపట్టి ప్రజలను వంచించారని విమర్శించారు. ఆంధ్రప్రదేశ్‌కు ప్రత్యేక హోదా ఇస్తామని చెప్పిన బిజెపి తుంగలో తొక్కిందన్నారు. సిఎం చంద్రబాబునాయుడు కూడా రాష్ట్రాన్ని తాకట్టు పెట్టారని విమర్శించారు. ప్రతిపక్ష పార్టీలకు కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలపై పోరాటం చేయడానికి స్పష్టమైన వైఖరి కరువైందని పేర్కొన్నారు. ప్రత్యేక ఆర్థిక మండలికి అచ్యుతాపురం, రాష్ట్రంలో 33 సెజ్‌లకు 33వేల 770 ఎకరాలు భూములను సేకరించారన్నారు. ఇందులో అచ్యుతాపురం, రాంబిల్లి మండలాల్లో 9వేల200 ఎకరాల భూములను రైతుల నుండి బలవంతంగా సేకరించారని తెలిపారు. ఎకరానికి 50వేల రూపాయల పరిహారం ఇస్తామని అప్పటి ప్రభుత్వం ప్రకటించడంపై నిర్వాసితులకు సిపిఎం బాసటగా నిలచి గ్రామ స్థాయి నుండి రాష్ట్ర స్థాయి వరకు పలు పోరాటాలు చేసిందని గుర్తు చేశారు. ఎకరాకు 2లక్షల75వేల ధర వచ్చేంత వరకు పోరాటం చేశామన్నారు. నిర్వాసితులకు న్యాయం చేస్తామన్న వైఎస్ ప్రభుత్వం తీరని అన్యాయం చేసిందని పేర్కొన్నారు. తీరం వెంబడి రసాయనిక పరిశ్రమలు నెలకొల్పడంతో వాటి వ్యర్థాలతో మత్స్యకారులు జీవనోపాధి తీవ్రంగా దెబ్బ తిందని చెప్పారు. బ్రాండిక్స్‌లో అతి తక్కువ జీతాలు ఇచ్చి కార్మికుల శ్రమను దోచుకుంటున్నారని ఆయన విమర్శించారు. 8వేల రూపాయలు జీతాలు ఇవ్వడానికి పరిశ్రమ వర్గాలు ముందుకు రాగా వాటిని అమలు చేయకుండా ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడు సెజ్‌లో పర్యటించి కేవలం వెయ్యి రూపాయలు మాత్రమే పెంచి మహిళా కార్మికులకు తీరని అన్యాయం చేశారని చెప్పారు. సెజ్‌లో స్టీల్ ప్లాంట్ లాంటి ప్రభుత్వ పరిశ్రమలు నెలకొల్పినట్లయితే ఈ ప్రాంతం ఊహించని విధంగా శరవేగంగా అభివృద్ధి చెంది ఉండేదని పేర్కొన్నారు. కమ్యూనిస్ట్ పార్టీ పాలనలో ఉన్న చైనాలో 135 కోట్ల జనాభా ఉన్నా వారందరికి విద్య, ఉపాధి, వైద్యం అందుతుందన్నారు.

రైతాంగం బతికేది ఎలా? : బాబూరావు

మాజీ ఎంపి మిడియం బాబూరావు మాట్లాడుతూ, రాష్ట్ర ముఖ్యమంత్రిగా చంద్రబాబు నాయుడు 15లక్షల ఎకరాల భూములు సేకరించ తలపెట్టారని, ఇందులో ఇప్పటికే 8లక్షల ఎకరాలు సేకరించారని తెలిపారు. భూములపై ఆధారపడి జీవించే రైతాంగం బతికే పరిస్థితి రాష్ట్రంలో లేదని ఆయన ఆవేదన వ్యక్తం చేశారు. ఇలా అయితే వారు ఎలా బతుకుతారని ప్రశ్నించారు. సేకరించిన భూములకు 2013 చట్టం ప్రకారం పరిహారం ఇవ్వ లేదన్నారు. అన్నపూర్ణగా ఉన్న ఆంధ్రాను రియల్ ఎస్టేట్‌గా మారుస్తున్నారని విమర్శించారు. రైతులను ఆదుకుంటానని చెప్పిన ముఖ్యమంత్రి వారిని నిరాశ్రయులుగా చేయడమే లక్ష్యంగా పాలన సాగిస్తున్నారని దుయ్యబట్టారు. పోలవరం ను జాతీయ ప్రాజెక్టుగా చేస్తానని చెప్పిన ప్రధాని, ఇందుకు సబంధించి సిఎం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తున్నారని పేర్కొన్నారు. బిజెపి ఫాసిస్ట్ పార్టీ విధానాలను అవలంభిస్తుందన్నారు. చివరకి ప్రణాళిక సంఘాన్ని లేకండా చేసిందన్నారు. నోట్ల రద్దుతో ఆర్థిక రంగం



సభలో మాట్లాడుతున్న నర్సింగరావు, వేదికపై బాబూరావు

దేశవ్యాప్తంగా అతలాకుతలం అయిందని, చిన్న తరహా పరిశ్రమల మూతతో కార్మికులు రోడ్డు పడ్డారని ఆవేదన వ్యక్తం చేశారు. జిఎస్‌టితో పెట్టుబడిదారులు లబ్దిపొందారని, పేదలపై ఆ భారం తడిసి మోపుడు అవుతుందని తెలిపారు. బిజెపి అనుసరిస్తున్న మతోన్మాద చర్యలను తీవ్రంగా ఖండించాల్సి ఉందన్నారు.

నిర్వాసితుల సమస్యలపై పోరాటం : లోకనాథం

సిపిఎం జిల్లా కార్యదర్శి కె.లోకనాథం మాట్లాడుతూ, నిర్వాసితులు ఎదుర్కొంటున్న సమస్యల పరిష్కారానికి పోరాడతామన్నారు. ఎంపిటిసికి 1200 ఎకరాల భూములు కేటాయించారని, పరిశ్రమల పనుల చేపట్టక పోగా రైతుల వద్ద సేకరించిన భూముల్లో టిడిపి బ్రోకర్లు వాటిని అనుభవిస్తురన్నారు. బిటెక్‌లు చదివిన నిర్వాసిత నిరుద్యోగులు ఉపాధి సమస్యలు ఎదుర్కొంటున్నారన్నారు. భూములు కోల్పోయిన వారికే ఉపాధి కల్పించాలని ఆయన డిమాండ్ చేశారు. జన్మభూమి సభలు టిడిపి పార్టీ సభలుగా మారాయని విమర్శించారు. ఈ కార్యక్రమంలో నాయకులు జి.కోటేశ్వరరావు, రొంగలి రాము, కర్రి అప్పారావు, కె.రామసదాశివరావు, కొవిరి అప్పలరాజు, ఎ.బాలకృష్ణ, గనిశెట్టి సత్యనారాయణ, చోడపల్లి అప్పారావు, తదితరులు పాల్గొన్నారు.

రామారావు అందరికీ ఆదర్శం

సంతాప సభలో సిఐటియు జిల్లా అధ్యక్షులు శ్రీనివాస్

ప్రజాశక్తి - శ్రీకాకుళం ప్రతినిధి

ప్రజాశక్తిలో విలేకరిగా, డివిజన్ ఇన్‌ఛార్జిగా అంకితభావం, నిబద్ధతతో పనిచేసిన కీర్తిశేషులు జన్ని రామారావు అందరికీ ఆదర్శం కావాలని సిఐటియు జిల్లా అధ్యక్షులు కె.శ్రీనివాసు అన్నారు. ఈనెల ఒకటో తేదీన హఠాన్మరణం చెందిన రామారావు సంతాప సభను ప్రజాశక్తి శ్రీకాకుళం ఎడిషన్ కార్యాలయంలో డెస్క్ ఇన్‌ఛార్జి జి.లక్ష్మణరావు అధ్యక్షతన శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ప్రజాశక్తికి ప్రకటనల సేకరణలో పలాస డివిజన్‌ను రామారావు అగ్రస్థానంలో నిలిపారని చెప్పారు. విలేకరులను ప్రోత్సాహిస్తూ, పనిలో భాగస్వామ్యం కావడం ద్వారానే ఇది సాధించగలిగారన్నారు. విప్లవోద్యమాలకు అంకితమైనందునే అన్ని రంగాల్లోనూ ఆయన రాణించగలిగారని కొనియాడారు. ఎడిషన్ మేనేజర్ ఎం.వెంకటేశ్వరరావు మాట్లాడుతూ రామారావు ఎస్ఎఫ్ఐ, డివైఎఫ్ఐ కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనేవారని చెప్పారు. ప్రజాశక్తిలో అంకితభావంతో పనిచేసిన ఉద్యోగిని కోల్పోవడం సంస్థకు తీరనిలోటు అని ఆవేదన వ్యక్తం చేశారు. సీనియర్ పాత్రికేయులు సత్తారు భాస్కరరావు మాట్లాడుతూ విలేకరులకు పని అప్పగించడం, పని బాధ్యతలు తీసుకోవడం రామారావుకు ఉన్న మంచి లక్షణాలని చెప్పారు. ఎడిషన్ సర్క్యులేషన్ ఇన్‌ఛార్జి ఎ.సోమశేఖరరావు మాట్లాడుతూ రామారావులో ఉన్న అంకితభావం, సమయపాలన, పట్టుదలను స్ఫూర్తిగా తీసుకుని పనిలో ముందుకు సాగాలన్నారు. తొలుత రామారావు చిత్రపటానికి పూలమాలలు వేసి నివాళ్లర్పించారు. సభలో ఎడిషన్ ఇన్‌ఛార్జి ఎస్.శ్రీనివాసరావు, ఉద్యోగులు, సిబ్బంది పాల్గొన్నారు.



రామారావు చిత్రపటానికి నివాళ్లర్పిస్తున్న శ్రీనివాసు, వెంకటేష్ తదితరులు

నగరంలో నేడు

+++++

మధ్యాహ్నం 2.30 గంటలకు విశాఖ పబ్లిక్ లైబ్రరీలో ఎఫ్ఆర్డిఐ బిల్లుపై సదస్సు

+++++

మధ్యాహ్నం 3 గంటలకు ఆర్కె బీచ్ రోడ్డులో పూరీ గోస్వామి మహరాజ్ జయంతోత్సవాలు

+++++

ఉదయం 10 గంటలకు విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో సిఐటియు ఆధ్వర్యాన ఎఫ్ఆర్డిఐ బిల్లుపై ప్రెస్‌మీట్

+++++

ఉదయం 5.30 గంటలకు ఆర్కె బీచ్‌లో బ్రెస్ట్ క్యాన్సర్‌పై అవగాహనా ర్యాలీ

+++++

అత్యవసర సమాచారం

కింగ్ జార్జ్ ఆసుపత్రి	- 2564891
విక్టోరియా ఆసుపత్రి	- 2562637
మెంటల్ ఆసుపత్రి	- 2754918
ఎఎస్ రాజా రక్తనిధి కేంద్రం	- 2543436
పోలీస్ కంట్రోల్ రూమ్	- 100, 2565454
క్రైమ్ స్టాపర్	-1090
ఆర్టీసీ	- 2746400
తాగునీటి ఫిర్యాదులు	- 2517261
ఫైర్	- 101
రైల్వే రిజర్వేషన్ ఎంక్వైరీ	- 135
వంట గ్యాస్	- 2578158
విద్యుత్ సమాచారం	- 2718091
ఇండియన్ ఎయిర్ లైన్స్	- 2746501
జెట్ ఎయిర్ వేస్	- 23401222
సహారా ఎయిర్‌లైన్స్	- 5572333
ఎయిర్ డెక్కన్	- 2543352
ఎయిర్ పోర్టు	- 2757263

సినిమా... సినిమా



టూ కంట్రీస్ : జోతి, వి మ్యాక్స్ 3, శ్రీరామ, శ్రీ నరసింహ (గోపాలపట్నం)

ప్రోజెక్టు : శ్రీ లీలామహల్, పరమేశ్వరి (కంచరపాలెం), మౌర్య (గోపాలపట్నం)

జుమంజి : శారద, వెంకటేశ్వర, నరసింహ (గోపాలపట్నం)

ఒక్క క్షణం : వి మ్యాక్స్ 1, కిన్నెర, శ్రీ లక్ష్మీ నరసింహ (104 ఏరియా), సత్యం (గోపాలపట్నం)

హలో : మెలోడి, సంగం, ఊర్వశి (కంచరపాలెం), సౌజన్య (సుకన్య)

ఎంసిఎ : జగదాంబ, కామేశ్వరి, శ్రీకన్య, శ్రీ లక్ష్మీ నరసింహ స్క్రీన్ 1 (104 ఏరియా), శంకర (గోపాలపట్నం), అన్నపూర్ణ (కూర్మన్నపాలెం), ఎస్‌విసి లిఖిత (శ్రీహరిపురం), కన్య స్క్రీన్ 1 (గాజువాక), ఎస్‌టిబిఎల్ స్క్రీన్ 2 (షీలానగర్)

ఇఈ : వి మ్యాక్స్ 3

ఖాకీ : వెంకటేశ్వర స్క్రీన్ 2

టైగర్ జిందగీ హై : రమాదేవి

రాజా ది గ్రేట్ : శ్రీకాంతి

జవాన్ : వి మ్యాక్స్ 2



పట్టుబడ్డ బియ్యం



నిందితులను పట్టుకున్న విజిలెన్స్ అధికారులు

బోనిలో రైస్‌మిల్లు సీజ్

రేషన్ బియ్యం పట్టివేత
విజిలెన్స్ అధికారుల మెరుపుదాడి

ప్రజాశక్తి - ఆనందపురం

మండలంలోని బోని వద్ద గల మహాలక్ష్మి ఎంటర్‌ప్రైజెస్ రైస్‌మిల్లులో అక్రమంగా నిల్వచేసిన రేషన్ బియ్యాన్ని శనివానం విజిలెన్స్ అధికారులు పట్టుకున్నారు. విజిలెన్స్ అండ్ ఎన్‌ఫోర్స్‌మెంట్ ఎస్‌పి డి.కోటేశ్వరరావు ఆధ్వర్యంలో ఈ దాడులు జరిగాయి. స్వాధీన పర్చుకున్న బియ్యం విలువ రూ.2 లక్షలా 10 వేలు ఉంటుందని అధికారులు తెలిపారు.

మిల్లుకు బొలేరో వ్యాన్‌పై రేవిడికి చెందిన సంపంగి సూర్యనారాయణ బియ్యాన్ని తీసుకొస్తున్నాడు. అప్పటికే మాటువేసిన అధికారులు దాడి చేసి మిల్లు నిర్వాహకులు బండారు అప్పలగణేష్, బండారు శ్రీనివాస్‌లను ప్రశ్నించారు. వారి నుంచి సరైన సమాధానం రాకపోవడంతో రేషన్ సరుకును సీజ్ చేసి పౌర సరఫరాల శాఖకు అప్పగించారు. ఈ మిల్లుపై మూడు నెలల కిందట కూడా దాడులు జరిగాయి. అప్పుడూ సీజ్ చేశారు. అయినప్పటికీ నిర్వాహకులు తీరుమార్చుకోలేదు. రేషన్ బియ్యాన్ని తక్కువకు కొని పాలిష్ చేసి ఎక్కువ ధరకు విక్రయించడానికి ఉన్న అన్ని అడ్డదారులనూ నిర్వాహకులు తొక్కారు. దాడుల్లో విజిలెన్స్ సిఐ మల్లిఖార్జునరావు, ఎస్ఐ రమేష్, తహశీల్దార్ సుమబాల సిబ్బంది పాల్గొన్నారు.

అత్యాచార బాధితురాలికి న్యాయం చేయాలి

సిపికి ప్రజా సంఘాల వినతి

ప్రజాశక్తి - విశాఖపట్నం

అత్యాచారానికి గురైన అరకు మండలం లోతేరు గ్రామానికి చెందిన గిరిజన మూగ బాలికకు న్యాయం చేయాలంటూ వికలాంగుల హక్కుల జాతీయ వేదిక (ఎన్‌పిఆర్‌డి), ఐద్వా, గిరిజన సంఘం ఆధ్వర్యాన సిపి యోగానంద్‌కు పోలీస్ కమిషనరేట్‌లో శనివారం వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా నాయకులు మాట్లాడుతూ దువ్వాడ సెజ్‌లోని హెచ్‌బిఎల్ కంపెనీలో తోట పని చేస్తున్న బాధితురాలిపై బస్సు డ్రైవర్ విశ్వనాథం వారం రోజుల కిందట అత్యాచారానికి పాల్పడ్డాడన్నారు. ఈ విషయాన్ని బయటకు రాకుండా చేసుందుకు అటు కంపెనీ, ఇటు సెజ్ యాజమాన్యం అడ్డదార్లు తొక్కాయని తెలిపారు. రూ.లక్ష ఇచ్చి చేతులు దులుపేసుకోవడానికి యత్నించాయని పేర్కొన్నారు. ఘటన వెలుగులోకి వచ్చిన తరువాత డ్రైవర్‌తో సహా ముగ్గురిని అరెస్టు చేశారన్నారు. అయితే ఈ కేసును పక్కదారి పట్టించడానికి యత్నించిన హెచ్‌బిఎల్ యాజమాన్యంపై కనీస చర్యలు కూడా తీసుకోలేదన్నారు. ఇప్పటికైనా నిందితులపై నిర్భయ కేసు పెట్టాలని డిమాండ్ చేశారు. బాధితురాలికి రూ.30 లక్షల ఎక్స్‌గ్రేషియో అందజేయాలన్నారు. ఫాస్ట్‌ట్రాక్ కోర్టు ఏర్పాటు చేసి కేసు దర్యాప్తును వేగవంతం చేయాలని కోరారు. ఇల్లు, భూమి కేటాయించడంతోపాటు ఇప్పటికే ఇచ్చిన ఉద్యోగ హామీని నెరవేర్చాలని కోరారు. కేసును నీరుగార్చేందుకు ప్రయత్నించిన కంపెనీని బ్లాక్‌లిస్టులో పెట్టాలని విజ్ఞప్తి చేశారు. సెజ్‌ల్లో భద్రతా ప్రమాణాలను మెరుగుపరచాలని, మహిళలకు సౌకర్యాలు కల్పించాలని కోరారు. కార్యక్రమంలో ఐద్వా నగర కార్యదర్శి ఆర్ఎన్.మాధవి, నాయకులు వేణు, సంతోషం, ఎన్‌పిఆర్‌డి నగర అధ్యక్షులు పాల వెంకయ్య, గిరిజన సంఘం నాయకులు పృధ్వీ, విజయ్ పాల్గొన్నారు.

నేడు ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆరో వార్షికోత్సవం

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్

ఫ్రెండ్స్ కామెడీ క్లబ్ ఆరో వార్షికోత్సవ వేడుకులను ఆదివారం నిర్వహించనున్నట్లు ఆ సంస్థ ప్రతినిధి ఎంవి.సుబ్రమణ్యం శనివారం ఒక ప్రకటనలో తెలిపారు. వినోదాల విందుతోపాటు మనసుదోచే మధురగీతాలు, డ్యాన్సులు ఉంటాయని పేర్కొన్నారు. సాయంత్రం 6 గంటలకు జరిగే ఈ కార్యక్రమంలో ఎయు విసి జి.నాగేశ్వరరావు, సివిల్ సర్జన్ డి.శ్రీలక్ష్మి హాజరవుతారన్నారు.

ఐఐఎమ్‌లో సంక్రాంతి సంబరాలు



విజేతలకు బహుమతులు అందజేస్తున్న నిర్వాహకులు

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్

దేశ సంప్రదాయాలను ప్రతి ఒక్కరూ కాపాడాలని కలెక్టర్ ప్రవీణ్ కుమార్ సతీమణి శోభనాస్మృతి అన్నారు. ఎంవిపి కాలనీ ఐఐఎమ్ కళాశాల విద్యార్థులు శనివారం సంక్రాంతి సంబరాలు నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ తెలుగువారంతా జరుపుకునే అతి పెద్ద పండుగ సంక్రాంతి అని అన్నారు. విద్యార్థులు చదువుతో పాటు ట్రెడిషన్‌ను ఆచరించాలన్నారు. ఫ్లూయెంట్‌గ్రిడ్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ వాణిగన్నమణి మాట్లాడుతూ కళాశాల ప్రాంగణంలో సంక్రాంతి శోభ ఉట్టిపడిందన్నారు. కార్యక్రమంలో కళాశాల డైరెక్టర్ విజయ రుద్రరాజు, సెక్రటరీ సుంకర రవీంద్ర, ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ తేజ, సమతా కాలేజ్ ప్రిన్సిపల్ విజయరవీంద్ర తదితరులు

భూ కబ్జా కేసులో వ్యక్తి అరెస్టు

ప్రజాశక్తి-భీమునిపట్నం

మండలంలోని కె.నగరపాలెం పంచాయతీ సోమన్నపాలెం గ్రామానికి చెందిన మరుపెళ్ల రామారావును భూ కబ్జా కేసులో శనివారం అరెస్టు చేసి కోర్టుకు తరలించారు. సిఐ ఎస్.బాల సూర్యారావు కథనం ప్రకారం తగరపువలస ఆదర్శనగర్‌లో నింగిబోతు జనార్ధన్‌రావుకు చెందిన 104, 105, 106, 107 సర్వే నెంబర్లలో సుమారు ఎకరా 15 సెంట్లు స్థలం ఉంది. సంబంధిత భూమిని రామారావు కబ్జా చేశాడు. బాధితుని ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు దర్యాప్తు చేస్తున్నారు.



ప్రమాదంలో దెబ్బతిన్న లారీ

రెండు లారీలు ఢీ

గాజువాక : బ్రేకులు ఫెయిలవడంతో ముందుగా వెళ్తున్న లారీని వెనుక నుంచి వస్తున్న లారీ ఢీకొంది. కుంచుమాంబ గుడి వద్ద శనివారం ఉదయం జరిగిన ఈ ఘటనలో వెనుక లారీ డ్రైవర్‌కు కాలు విరిగిపోయింది. వాహనాలు రోడ్డుపైనే ఎక్కువ సేపు నిలిచిపోవడంతో పోలీస్ స్టేషన్ సిగ్నల్ పాయింట్, శ్రీనగర్ ప్రాంతాల్లో ట్రాఫిక్ స్తంభించింది.



గంజాయిని పట్టుకున్న పోలీసులు

270 కిలోల గంజాయి స్వాధీనం

పెందుర్తి : మండలంలోని జెర్రిపోతులపాలెం సమీపంలో 270 కిలోల గంజాయిని పోలీసులు స్వాధీనం చేసుకున్నారు. వాహనం ఆంధ్రప్రదేశ్ రిజిస్ట్రేషన్ కలిగి ఉన్నప్పటికీ కేరళకు చెందినదిగా భావిస్తున్నారు. కేసు దర్యాప్తులో ఉంది.

కోడి పందేల శిబిరంపై దాడి

ఆరిలోవ: మూడో వార్డు పరిధి బిఎన్ఆర్.నగర్‌లో జరుగుతున్న కోడి పందేల శిబిరంపై దాడి చేసి షేక్ ఖలీల్, షేక్ మస్తాన్‌లను ఆరిలోవ పోలీసులు శనివారం అరెస్టు చేశారు. వారి నుంచి రెండు కోడి పుంజులను స్వాధీనం చేసుకున్నారు. కేసును సిఐ షణ్ముఖరావు దర్యాప్తు చేస్తున్నారు.

వృద్ధురాలి సజీవ దహనం

నర్సీపట్నం రూరల్ : నర్సీపట్నం మండలం చెట్టుపల్లి గ్రామంలో అర్ధరాత్రి జరిగిన అగ్ని ప్రమాదంలో వద్ధురాలు మతి చెందింది. నర్సీపట్నం ఎస్ఐ టి.శ్రీను తెలిపిన వివరాలు ఇలా ఉన్నాయి. చెట్టుపల్లి గ్రామానికి చెందిన గంగిరెడ్ల అప్పలనర్స అలియాస్ అప్పలరాజు (62) ఒంటరిగా తాటాకుల పాకలో నివసిస్తుందన్నారు. ఈ మధ్యకాలంలో ఆమె తరచూ పడిపోవడం వలన కాళ్ళకి చేతులకి గాయాలు కావడంతో ఆమెకు ఆపరేషన్ జరిగినట్లు చెప్పారు. వృద్ధాప్యం వలన ఎక్కడికి వెల్లలేకపోవడంతో అన్ని సదుపాయాలను తన కుమారుడే చూసుకుంటున్నాడని తెలిపారు. 4వ తేదీన తాపీ పనికి వెళ్లగా 5వ తేదీ రాత్రి మతురాలు అప్పలనర్సమ్మ చలికి ఏర్పాటు చేసుకున్న కుంపటిలోని మంటలు ఏర్పడడంతో మంచం పైన ఉండి కాలిపోయింది.

అలరించిన త్యాగరాజ ఆరాధనోత్సవాలు

ప్రజాశక్తి-మద్దిలపాలెం

నగరంలోని కళాభారతి ఆడిటోరియంలో త్యాగరాజ ఆరాధనా ట్రస్ట్ ఆధ్వర్యాన నిర్వహించిన త్యాగరాజ ఆరాధనోత్సవాల్లో నాదస్వర, గాన, వయోలిన్, వీణా కచేరీలు అలరించాయి. శనివారం ఉదయం 7 గంటలకు పూజా కార్యక్రమాలు వైభవంగా జరిగాయి. అనంతరం కళాభారతి ఆడిటోరియం చుట్టూ వెలుపల నిర్వహించిన తిరువీధి కార్యక్రమంలో వందలాది మంది కళాకారులు, భక్తులు పాల్గొని భక్తి పారవశ్యంతో కీర్తనలు, భజనలు గావించారు. ఉదయం 8.15 నిమిషాలకు ఆడిటోరియంలో జరిగిన కార్యక్రమాన్ని ప్రముఖ వయోలిన్ విద్వాంసుడు నాద సుధార్ణవ, నాద నిధి అన్నవరపు రామస్వామి జ్యోతి ప్రజ్వలన చేసి ఉత్సవాలను ప్రారంభించారు. అనంతరం ప్రముఖ నాదస్వర విద్వాంసుడు గురువిల్లి అప్పన్న బృందం నిర్వహించిన మంగళ ప్రదమైన నాదస్వర కచేరీతో సంగీత కార్యక్రమాలు ప్రారంభమయ్యాయి. డాక్టర్ పప్పు లలిత, తల్లాప్రగడ మాణిక్యలక్ష్మి, ద్వారం దుర్గా ప్రసాదరావు వంటి కళాకారులు నిర్వహించిన త్యాగరాజ స్వామి కీర్తనలతో ఆడిటోరియం భక్తి రసమయమైంది. కార్యక్రమంలో పాల్గొన్న కళాకారులకు, భక్తులకు నిర్వాహకులు మధ్యాహ్నం అన్న ప్రసాదం, రాత్రి ప్రసాద వితరణ చేశారు. ఈ కార్యక్రమంలో త్యాగరాజ ఆరాధనా ట్రస్ట్ ప్రతినిధులు సిఎస్ఎన్.రాజు, ఐవిఎల్.శాస్త్రి, పంతుల గోపాలరావు, జిఆర్కె.ప్రసాద్ (రాంబాబు) తదితరులు పాల్గొన్నారు.

భక్తి పారవశ్యంగా తిరువీధి కార్యక్రమం



కచేరీ నిర్వహిస్తున్న సంగీత కళాకారులు

ఎగ్జిబిషన్‌లో రెప్కోబ్యాంకు ప్రదర్శన

ప్రజాశక్తి-జిల్లాపరిషత్

ఆంధ్రాయూనివర్సిటీ ఇంజినీరింగ్ కాలేజీ మైదానంలో ఏర్పాటుచేసిన క్రాఫ్ట్ ఎగ్జిబిషన్‌లో రెప్కోబ్యాంకు ప్రదర్శన సందర్శకులను ఆకట్టుకుంటుంది. బ్యాంకు అందిస్తున్న రుణాలు, డిపాజిట్‌కు సంబందించిన వివిధ పథకాలను ప్రదర్శిచారు. వీటిని సందర్శకులకు అర్థమయ్యే రీతిలో వివరించేందుకు ఉద్యోగులను ఏర్పాటుచేశారు. దీంతో సందర్శకులు రెప్కోబ్యాంకు సేవల పట్ల హర్షం వ్యక్తం చేస్తున్నారు. ఈ ప్రదర్శనను ఆదివారంతో ముగించనున్నందున ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని నిర్వాహకులు కోరుతున్నారు.

'ఈ ఆఫీస్' పై అవగాహన

ఆరిలోవ : శ్రీక్రిష్ణాపురం సాంఘిక సంక్షేమ గురుకుల పాఠశాలలో ఈ ఆఫీస్‌పై శనివారం అవగాహన కార్యక్రమం నిర్వహించారు. జిల్లాలోని 11 గురుకుల పాఠశాలల ప్రిన్సిపల్స్, పర్యవేక్షణాధికారులు, సిబ్బంది సుమారు 33 మంది ఈ అవగాహన కార్యక్రమానికి హాజరయ్యారు. జిల్లా కో-ఆర్డినేటర్ కెడివి.చంద్రశేఖర్ ముఖ్యఅతిథిగా పాల్గొని కార్యక్రమాన్ని ప్రారంభించి మాట్లాడారు. విద్యావ్యవస్థలో కాగిత రహిత కార్యకలాపాలను సాగించేందుకు ఈ ఆఫీస్ ద్వారానే సాగించవచ్చున్నారు. విద్యావ్యవస్థలో ఒక కార్యాలయం నుంచి మరో కార్యాలయానికి ఎటువంటి ఫైల్స్‌తో పని లేకుండా కేవలం ఈఆఫీస్ ద్వారానే కార్యకలాపాలు సాగించవచ్చని తెలిపారు. దీనికోసం సిబ్బందికి ఈ ఆఫీస్‌పై అవగాహన కల్పిస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో శ్రీక్రిష్ణాపురం గురుకుల పాఠశాల, కాలేజీ ప్రిన్సిపల్ కె.కోటేశ్వరరావు, రూపావతి, ఇతర ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.

స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలి

ఆరిలోవ : భారత ప్రభుత్వం హస్తకళల మంత్రిత్వశాఖ ద్వారా షెడ్యూల్ కులాల అభ్యర్థులకు అందిస్తున్న స్వయం ఉపాధి పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎయు విశ్రాంత ఆచార్యులు వై.భాస్కరాచార్యులు సూచించారు. హస్త కళ మంత్రిత్వ శాఖ ఆధ్వర్యాన విశాలాక్షినగర్, దయాల్‌బాగ్‌లోని దయాల్‌బాగ్ ఎడ్యుకేషనల్ ఇనిస్టిట్యూట్‌లో బ్లాక్ పెయింటింగ్, టై అండ్ డై శిక్షణ ముగింపు కార్యక్రమం శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, మహిళల, పురుష సాధికారత గురించి తెలియజేశారు. శిక్షణ పూర్తి చేసుకున్న అభ్యర్థులు ఆర్థికంగా ఎదిగేందుకు కృషి చేయాలన్నారు. అనంతరం శిక్షణ పూర్తిచేసిన అభ్యర్థులకు ముఖ్యఅతిథిచే సర్టిఫికెట్లను అందజేశారు. సత్సంగ బ్రాంచి కార్యదర్శి, మేనేజింగ్ కమిటీ సభ్యులు గురప్యాలా అధ్యక్షతన నిర్వహించిన కార్యక్రమంలో డిఇఐ సభ్యులు కెఎస్.ప్రసాదరావు, కోర్సు కో-ఆర్డినేటర్ జ్యోతి వారణాసి, మనోజ్ లంక, వి.దక్షిణమూర్తి, పాల్గొన్నారు.



సర్టిఫికెట్లను ప్రదానం చేస్తున్న ముఖ్య అతిథి

'రెండు, మూడు రోజుల్లో హెచ్‌ఆర్ఎ చెల్లింపులు'

ఉక్కునగరం : ఉక్కు ఉద్యోగులు ఎంతో కాలంగా ఎదురుచూస్తోన్న 20శాతం హెచ్ఆర్ఎ రెండు మూడు రోజుల్లో యాజమాన్యం చెల్లిస్తుందని ఉక్కు గుర్తింపు యూనియన్ ప్రధాన కార్యదర్శి మంత్రి రాజశేఖర్ తెలిపారు. శనివారం యూనియన్ అధ్యక్షుడు గంధం వెంకటరావు అధ్యక్షతన ఏర్పాటుచేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. సెయిలో ఇంత వరకు హెచ్ఆర్ఎ చెల్లింపులు జరపనప్పటికీ స్టీల్‌ప్లాంట్‌లో మాత్రం కొత్త బేసిక్‌పై 20 శాతం హెచ్ఆర్ఎ చెల్లించాలని కేంద్ర ఉక్కు మంత్రి, ఉన్నతాధికారులను కలిశామని, చివరికి యాజమాన్యం సహకారంతో దీనిని సాధించమన్నారు.

ముగ్గుల పోటీలు

ప్రజాశక్తి - ఆరిలోవ

సంక్రాంతి సంబరాలను పురస్కరించుకొని తూర్పు నియోజకవర్గంలోని ఒకటి, రెండు వార్డుల పరిధిలో వైసిపి ఆధ్వర్యాన మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. తూర్పు నియోజకవర్గం వైసిపి సమన్వయకర్త వంశీకృష్ణశ్రీనివాస్ ముఖ్యఅతిథిగా పాల్గొన్నారు. ఒకటో వార్డు పరిధి ఆరిలోవ కాలనీ, శ్రీకాంత్‌నగర్ లేఅవుట్‌లో ఏర్పాటుచేసిన ముగ్గుల పోటీల్లో 146 మంది మహిళలు పాల్గొన్నారు. ప్రథమ స్థానంలో నిలిచిన డొప్ప దేవికి రూ.5వేలు, ద్వితీయ, తృతీయ స్థానాల్లో నిలిచిన పిల్లి సాగరిక, వై.కనకమహాలక్ష్మిలకు రూ.3వేలు, 2వేలును వంశీకృష్ణశ్రీనివాస్ అందజేశారు. ఈ సందర్భంగా వంశీకృష్ణ శ్రీనివాస్ మాట్లాడుతూ, తెలుగు వారి సంప్రదాయాలను కాపాడే విధంగా ముగ్గుల పోటీలను నిర్వహించడం సంతోషంగా ఉందన్నారు. విశాఖలో లేని కొత్త సంస్కృతికి టిడిపి నాయకులు తెరలేపారని విమర్శించారు. కోడి, గుర్రపు, పొట్టేలు పందేలకు తెరతీస్తూ యువతను పెడతోవ పెట్టిస్తుండటం దురదృష్టకరమన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి జిల్లా ఆర్గనైజింగ్ కార్యదర్శి సత్తి మందారెడ్డి, వార్డు అధ్యక్షులు మొగ్గ ఆదినారాయణ, కె.శిరీషా, బోని శివరామక్రిష్ణ, రాజబాబు, కెఆర్.పాత్రుడు, ఇమంది సత్యనారాయణ, మాధవి, శ్రీదేవి, వనం వరలక్ష్మి, మహిళలు పాల్గొన్నారు.

రెండోవార్డులో...

రెండో వార్డు పరిధి ఆరిలోవ టిఐసి పాయింట్ సమీపంలో మహిళల ముగ్గుల పోటీల్లో 163 మంది మహిళలు పాల్గొన్నారు. ఈ పోటీల్లో ప్రథమ స్థానంలో నిలిచిన ఎ.సంతోషికి రూ.5 వేలు, ద్వితీయ స్థానం సాధించిన జ్యోతికి రూ.3వేలు, తృతీయ స్థానంలో నిలిచిన రాజరాజేశ్వరికి రూ.2వేలు, నాలుగో స్థానం సాధించిన కె.దేవికి రూ.2 వేలును వంశీకృష్ణశ్రీనివాస్ అందజేశారు. వార్డు వైసిపి అధ్యక్షుడు గొలగాని శ్రీనివాసరావు ఆధ్వర్యాన నిర్వహించిన కార్యక్రమానికి భారతీ ఇంగ్లీషు మీడియం స్కూలు డైరెక్టర్ ఎంవి.రావు, చొక్కర శేఖర్, పీతల మూర్తియాదవ్, రాగతి అచ్యుతరావు, మొల్లి ఆప్పారావు తదిరులు పాల్గొన్నారు.


ముగ్గులను పరిశీలిస్తున్న వంశీకృష్ణ శ్రీనివాస్

ప్రభుత్వ రంగాన్ని రక్షించుకుందాం

ప్రజాశక్తి-ఉక్కునగరం

ప్రభుత్వ రంగ సంస్థలన్నింటినీ నిర్వీర్యం చేసి వాటిని బడా ప్రయివేటు సంస్థలకు అప్పగించేందుకు కేంద్రం ముమ్మర ప్రయత్నాలు చేస్తోందని, దీనిని ప్రతి ఒక్కరూ వ్యతిరేకించి ప్రభుత్వ రంగాన్ని రక్షించుకోవాలని ఎఐటియుసి అఖిల భారత ప్రధాన కార్యదర్శి అమర్‌జిత్‌కౌర్ పిలుపునిచ్చారు. స్టీల్‌ప్లాంట్‌లో శనివారం ఆమె పర్యటించారు. ఈ సందర్భంగా ఏర్పాటుచేసిన విలేకరుల సమావేశంలో ఆమె మాట్లాడుతూ, ప్రభుత్వ రంగ సంస్థలతోనే దేశ ఆర్థిక వ్యవస్థ బలపడుతుందని, అలాంటి సంస్థలను కేంద్రం నిర్వీర్యం చేయడం దుర్మార్గమని పేర్కొన్నారు. లాభ, నష్టాలతో సంబంధం లేకుండా ప్రభుత్వ రంగ సంస్థలను ప్రయివేటుపరం చేస్తే దేశ ఆర్థిక వ్యవస్థ చిన్నాభిన్నమవుతుందన్నారు. నవరత్న కంపెనీగా ఉన్న విశాఖ ఉక్కు కర్మాగారం (ఆర్ఐఎన్ఎల్) విషయంలో కేంద్రం అడుగడుగునా నిర్లక్ష్యంగా వ్యవహరిస్తోందన్నారు. ఇప్పటి వరకు సొంత గనులను కేటాయించకపోవడమే దీనికి నిదర్శనమన్నారు. రాష్ట్ర ప్రభుత్వం కూడా స్టీల్‌ప్లాంట్ విషయంలో ఏమీ పట్టనట్లు ఉంటుందని ఆగ్రహం వ్యక్తం చేశారు. ఇప్పుడిప్పుడే పుంజుకుంటున్న కర్మాగారంపై డిజిన్వెస్ట్‌మెంట్ నిర్ణయం తీవ్ర ప్రభావం చూపుతుందన్నారు. ఈ సమావేశంలో స్టీల్ ఎఐటియుసి అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు జి.బోసుబాబు, డి.ఆదినారాయణ, నాయకులు జి.సోమన్న, కెఎస్ఎన్.రావు, పిఎస్ఎన్.రాజు, ఎన్.మిశ్రా, జె.రామకృష్ణ, కె.రాజబాబు, జయ, దేముడు తదితరులు పాల్గొన్నారు.

నిర్మలకు ఎయు డాక్టరేట్

మద్దిలపాలెం : ఆంధ్రాయూనివర్శిటీ పర్యావరణ శాస్త్ర విభాగ పరిశోధక విద్యార్థిని కోటపూరి నిర్మలకు ఎయు డాక్టరేట్ లభించింది. ఆచార్య టి.బైరాగి రెడ్డి పర్యవేక్షణలో 'ఐడెంటిఫికేషన్ అండ్ క్వంటిఫికేషన్ ఆఫ్ బయో ఏరోసోల్స్ ఆఫ్ సెలెక్టెడ్ స్కూల్స్, స్లమ్స్ అండ్ సీవేజ్ ప్లాంట్స్ ఆఫ్ విశాఖపట్నం' అనే అంశంపై నిర్మల పరిశోధన చేశారని డిప్యూటీ రిజిస్ట్రార్ టివి.సత్యవతీదేవి తెలిపారు. నిర్మలను విభాగ ఆచార్యులు, పరిశోధకులు, కుటుంబ సభ్యులు అభినందించారు.

మొదటి పేజీ తరువాయి

నిర్లక్ష్యంపై కేసు

సాంఘిక సంక్షేమ శాఖకు దరఖాస్తు చేసుకుంది. దరఖాస్తులో భాగంగా పోలీసుల వద్ద తీసుకున్న ఎఫ్ఐఆర్, చార్జీసీటు, ట్రైయిల్ కాపీలను సాంఘిక సంక్షేమ శాఖకు అందించాలి. ఈ కాపీల్లో ఉన్న సెక్షన్ల తీవ్రతను బట్టి సంక్షేమ శాఖ పరిహారం నిమిత్తం ప్రభుత్వానికి నివేధిస్తుంది. అయితే పోలీసులు కేసు స్థాయిని తగ్గించి రాయడం, దఫల వారీగా కేసులు పెట్టించడంతో ఆమెకు పరిహారం రావడం ఆలస్యమైంది. ఈ విషయంపై సదరు యువతి తనకు ఇవ్వాల్సిన నష్టపరిహారం ఆలస్యం చేయడమే కాకుండా, సెక్షన్లను తారుమారు చేశారంటూ ఎస్సీ, ఎస్టీ ప్రత్యేక కోర్టును ఆశ్రయించింది.

విచారణ అనంతరం బాధ్యులైన అధికారులపై కేసు నమోదు చేయాలని కోర్టు ఆదేశాలు జారీ చేసింది. ఈ మేరకు సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ డిడి. రమణమూర్తిని ఎ1గా, జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్‌ను ఏ2గా చేర్చుతూ ఎంవిపి పోలీస్‌స్టేషన్‌లో అట్రాసిటీ కేసు నమోదయ్యింది. 2016లో యువతి ఇచ్చిన ఫిర్యాదు ఎస్సీ, ఎస్టీ ప్రివెన్షన్ ఆఫ్ అట్రాసిటీస్ యాక్ట్, సిఆర్పీసీ 156 క్లాజ్ 3 కింద ఎంవిపి పోలీసులు ఎఫ్ఐఆర్ నమోదు చేసినట్లు తెలిపారు. పూర్తిగా నగదు బాధితురాలికి అందించినప్పటికీ కోర్టులో కేసు వేయడంపై కలెక్టర్ హైకోర్టును ఆశ్రయించనున్నారు.

రసాయన పరిశ్రమలతో దెబ్బతింటున్న మత్స్యకారుల ఉపాధి

ఆమె మాట్లాడారు. కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనుసరిస్తున్న విధానాలు వల్ల వివిధ తరగతుల ప్రజలు అనేక సమస్యలతో బాధపడుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. వామపక్షాలు, ప్రధానంగా సిపిఎం చేసిన పోరాట ఫలితంగా వచ్చిన ఉపాధి హామీ చట్టాన్ని సరిగా కేంద్ర ప్రభుత్వం అమలు చేయడం లేదన్నారు. చేసిన కూలి పనులకు నెలల తరబడి వేతనాలు చెల్లించకపోవడం బాధాకరమన్నారు. ఆశ, అంగన్‌వాడీ, మిడ్డేమీల్స్ తదితర స్కీంలో పనిచేస్తున్న మహిళలను వర్కర్లుగా ప్రభుత్వం గుర్తించడం లేదన్నారు. రిటైర్మెంట్ సదుపాయలు కూడా వర్తింపజేయలేదన్నారు. సమాన పనికి సమాన వేతనం ఇవ్వకుండా ప్రభుత్వాలు వెట్టిచాకిరీ చేయిస్తున్నాయని విమర్శించారు. ప్రజల జీవన పరిస్థితులపై దాడులు పెరుగుతున్నాయన్నారు.

దేశంలో 57 మంది వద్ద వున్న ఆస్థి, 70 శాతం ప్రజల ఆస్థితో సమానమన్నారు. ఇది దేశంలో పెరుగుతున్న ఆర్థిక అసమానతలకు అద్దం పడుతోందన్నారు. విద్య, వైద్యం వ్యాపారమయవుతున్న పరిస్థితుల్లో పేద, సామాన్యులకు అందుబాటులో లేకుండాపోతున్నాయన్నారు. సంపదను సృష్టించే కార్మికులు, కష్టజీవులు, ఆ సంపదను కొల్లగొట్టే విధానాలకు వ్యతిరేకంగా పోరాడాలన్నారు. వ్యవసాయ పంటలకు గిట్టుబాటు ధర లేకపోవడంతో రైతులు అప్పులు పాలవుతున్నారని తెలిపారు. మార్కెట్లో వస్తువుల ధరలు పెరుగుతున్నాయి తప్ప రైతులు పండించే పంటలకు మద్దతు ధర లభించకపోవడానికి ప్రభుత్వ విధానాలే కారణమన్నారు.



5 కిలోల సిలిండర్ల విక్రయాలు అంతంతమాత్రమే

ధర అధికం.. లభ్యత తక్కువ...
ప్రచార ఆర్భాటం ఎక్కువ

ప్రజాశక్తి-కలెక్టరేట్

కొత్తగా నగరానికి వచ్చి స్థిరపడే వారికోసం, కనెక్షన్ లేకుండా వంటకి గ్యాస్ ఎలా అని ఆందోళన చెందే వారి కోసం కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ఐదు కిలోల గ్యాస్ సిలిండర్ల విక్రయాలు అంతంత మాత్రంగానే ఉన్నాయి. ధర అధికం కావడంతో పాటు పెట్రోలు బంకుల్లో విక్రయించకపోవడంతో వీటికి తగిన ఆదరణ ఉండటం లేదు. సబ్సిడీ వంట గ్యాస్ సిలిండర్ 14.2 కిలోల ధర రూ.746 ఉంది. బ్యాంక్‌లో జమ అయ్యేది రూ.250.41. అంటే సబ్సిడీ పోను 14.2 కిలోల గ్యాస్ సిలిండర్ వినియోగదారులకు రూ.495.59కి లభిస్తుంది. అంటే సబ్సిడీపై గ్యాస్ కిలో ధర రూ.34 పడుతుంది. అయితే 5కిలోల సిలిండర్ గ్యాస్ ధర రూ.366గా ఉంది. ఈ లెక్కన చూస్తే కిలో గ్యాస్ ధర రూ.73.20 పడుతుంది. 14.2 కిలోల సిలిండర్ గ్యాస్ ధరతో పోలిస్తే 5 కిలోల బండలోని గ్యాస్ ధర కిలోకి రూ.39.20 అదనం అన్నమాట. కమర్షియల్ సిలిండర్ 19 కేజీలు ధర రూ.1309 గా ఉంది. అంటే కిలో రూ.68 పడుతుంది. అంటే కమర్షియల్ గ్యాస్ కంటే 5 కిలోల సిలిండర్‌లోని ధరే అధికంగా ఉంది.

5 కిలోల సిలిండర్ గ్యాస్‌ను కొనుగోలు చేయాలంటే ముందుగా బండ కోసం రూ.1000 చెల్లించాలి. డిపాజిట్టుగా చెల్లించిన దానికి రశీదు పొందాలి. అందులో 5కిలోల గ్యాస్ ఉంచడానికి రూ.366 చెల్లించాలి. అంటే ప్రారంభంలో రూ.1,366 చెల్లిస్తే గాని 5 కిలోల బండ గ్యాస్‌తో సహా లభించదు. ఇది కాకుండా రెగ్యులేటర్, పైపులు పొందడానికి అదనంగా ధర చెల్లించాలి. 5 కిలోల గ్యాస్‌ను వినియోగించాక ఖాళీ బండను తీసుకెళ్తే రూ.366 చెల్లిస్తే చాలు. ఖాళీ బండ తీసుకుని గ్యాస్‌తో ఉన్న మరో బండను ఇస్తారు. ఇందుకోసం ముందుగా బుకింగ్ చేసుకోవాల్సిన అవసరం లేదు. బండ ఎక్కడ కొనుగోలు చేశారో అక్కడే తిరిగి గ్యాస్‌ను ఖరీదు చేయనవసరం లేదు. ఏ డీలర్ వద్దనైనా తెచ్చుకోవచ్చు. ఎక్కడికైనా బదిలీఅయినా, ఇళ్లు మారినా డీలర్‌కు చెప్పే పని ఉండదు. ఇదంతా బాగా ఉన్నప్పటికీ ఎందుకనో 5 కిలోల గ్యాస్ సిలిండర్ల అమ్మకాలు జోరందుకోవడం లేదు.

ఐఒసి అధికారులు ఇటీవల 5 కిలోల గ్యాస్ సిలిండర్లపై విస్తృతంగా ప్రచారం చేస్తున్నారు. అయితే వారు చెబుతున్నట్టు పెట్రోలు బంకుల్లో 5 కిలోల సిలిండర్ల అమ్మకాలు లేవు. నగర పరిధిలో 72 పెట్రోలు బంకులు ఉంటే కేవలం రెండు బంకుల్లో మాత్రమే వీటి అమ్మకాలు జరుగుతున్నాయి.

ధర తగ్గినా ఆదరణ కొరత

నిజానికి 5 కిలోల గ్యాస్ సిలిండర్ల అమ్మకాలను నగరంలో 2014 ఫిబ్రవరి 12న ప్రారంభించారు. పూర్ణామార్కెట్ వద్ద ఉన్న శ్రీ ద్వారకామయి ఇండెన్ పంపిణీ సంస్థ ఆధ్వర్యాన రాక్‌డేల్ లే-అవుట్‌లో దీనిని ప్రారంభించారు. దీంతో పాటు వన్‌టౌన్, పెద వాల్తేర్, అక్కయ్యపాలెం, ఎంవిపి కాలనీ, లాసన్స్ బే కాలనీల్లోని గ్యాస్ కంపెనీ డీలర్ల వద్ద వీటి అమ్మకాలు ప్రారంభించారు. నగరంలోని పెట్రోలు బంకుల్లో కనీసం మూడో వంతు 48 బంకుల్లో వీటిని విక్రయించాలని భావించారు. అప్పటిలో 5 కిలోల సిలిండర్‌కు డిపాజిట్టును రూ.1693, గ్యాస్ కోసం రూ.548 చెల్లించాలని నిర్ణయించారు. బండ డిపాజిట్టు, గ్యాస్ ధర అధికంగా ఉండటంతో వీటిపట్ల ఎవరూ ఆసక్తి చూపలేదు. ఇప్పుడు డిపాజిట్టును రూ.1693 నుంచి రూ.1000కి తగ్గించారు. గ్యాస్ ధరను రూ.548 నుంచి రూ.366కి తగ్గించారు. అయినప్పటికీ 5 కిలోల గ్యాస్ బండల అమ్మకాలు జోరందుకోలేదు. వీటిని గ్యాస్ డీలర్లతోపాటు, అన్ని పెట్రోలు బంకుల్లోను రెగ్యులేటర్, పైపులతో కలిపి విక్రయించే ఏర్పాట్లు చేస్తే ఆదరణ పెరిగే వీలుంటుందని పలువురు అభిప్రాయపడుతున్నారు.

మత్స్యకారులను కించపరిచిన చంద్రబాబుకు తగిన బుద్ధి చెబుతాం

వైసిపి రాష్ట్ర నేత, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ


దీక్షా శిబిరంలో కూర్చున్న మాజీ మంత్రి మోపిదేవి

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఎస్‌టి జాబితాలో చేర్చాలని కోరడానికి వెళ్లిన మత్స్యకారుల ఎస్‌టి సాధన సమితి నాయకులు పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు బెదిరింపు ధోరణితో మాట్లాడటం సరికాదని, ఆయనకు తగిన బుద్ధి చెబుతామని వైసిపి రాష్ట్ర నేత, మాజీ మంత్రి మోపిదేవి వెంకటరమణ అన్నారు. మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలని కోరుతూ జివిఎంసి గాంధీ విగ్రహం వద్ద నిర్వహిస్తున్న రిలే నిరాహార దీక్షలు శనివారం నాటికి 11వ రోజుకు చేరాయి. దీక్షా శిబిరాన్ని వెంకటరమణ శనివారం సందర్శించి మాట్లాడారు. 2014 ఎన్నికల ముందు శ్రీకాకుళం సభలో చంద్రబాబు మాట్లాడుతూ అన్ని విధాలా వెనుకబడిన మత్స్యకారులను ఎస్‌టి జాబితాలో చేర్చుతామని చెప్పారని, అదే విషయాన్ని టిడిపి ఎన్నికల మేనిఫెస్టోలో పేర్కొన్నారని తెలిపారు. ఇచ్చిన హామీని నెరవేర్చమని కోరడం తప్పా అని ప్రశ్నించారు. మత్స్యకారులను అవమానిస్తూ మాట్లాడిన చంద్రబాబు తీరును గుర్తించుకుని 2019 ఎన్నికల్లో తగిన తీర్పు ఇవ్వాలని కోరారు. ఈ కార్యక్రమంలో వైసిపి అధికార ప్రతినిధి కొయ్య ప్రసాదరెడ్డి సినీ నటుడు అంబటి శ్రీను, మాజీ మేయర్ పులుసు జనార్దనరావు, వైసిపి మహిళా విభాగం అధ్యక్షులు గరికన గౌరి, బడే నరసింగరావు, గంటా పాపారావు, మూగి శ్రీనివాసరావు, మూగి శ్రీరామమూర్తి, కదిరి అప్పారావు, చెన్నాదాసు, కంటుముచ్చు తాతారావు, బుద్ధా నీలకంఠం తదితరులు పాల్గొన్నారు.

భారీ ర్యాలీ...

మత్స్యకారుల పట్ల ముఖ్యమంత్రి చంద్రబాబు చేసిన అనుచిత వ్యాఖ్యల నేపథ్యంలో వైసిపి దక్షిణ ఇన్‌చార్జి కోలా గురువులు నాయకత్వంలో వందల సంఖ్యలో మత్స్యకారులు, మహిళలు ఫిషింగ్ హార్బర్ నుంచి జగదాంబ, కోర్టు వీధుల మీదుగా జివిఎంసి గాంధీ విగ్రహం వరకు భారీ ర్యాలీ నిర్వహించారు. ముఖ్యమంత్రి డౌన్ డౌన్, మత్స్యకారులను ఎస్‌టిల్లో చేర్చాలి అంటూ ప్లకార్డులు ప్రదర్శించారు.

దళిత సంక్షేమాన్ని విస్మరించిన ప్రభుత్వాలు

ప్రజాశక్తి-దాబాగార్డెన్స్

కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు దళితుల సంక్షేమాన్ని పూర్తిగా విస్మరించాయని దళిత సేన రాష్ట్ర అధ్యక్షుడు పాలేటి పెంటారావు అన్నారు. దళితులపై రోజు రోజుకూ దాడులు ఎక్కువ అవుతున్నాయని, వీటిని నిలువరించడంలో ప్రభుత్వం విఫలమవుతోందని మండిపడ్డారు. మహారాష్ట్రలోని బీమ్ కోరేగావ్‌లో దళితులపై జరిగిన దాడిని నిరసిస్తూ దాబాగార్డెన్స్ అంబేద్కర్ విగ్రహం ఎదుట శనివారం ధర్నా నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, కేంద్రంలో బిజెపి అధికారంలోకి వచ్చాక దళితులపై దాడులు పెరిగాయని, మతోన్మాదశక్తులు రెచ్చిపోయి దాడులు చేస్తున్నాయని చెప్పారు. దేశవ్యాప్తంగా ఉన్న దళితులు, ప్రజాస్వామ్య వాదులు, లౌకికవాదులు ఈ దాడులను ఖండిస్తున్నారన్నారు. రాష్ట్రంలో తెలుగుదేశం ప్రభుత్వం లౌకికవాదాన్ని పక్కనపెట్టి కులం మతం పేరుతో విడదీసి పాలిస్తుందని విమర్శించారు. ఈ కార్యక్రమంలో దళితసేన మహిళ అధ్యక్షులు నక్కెళ్ల నాగమణి, ప్రధాన కార్యదర్శి సిహెచ్.ప్రభాకర్, నగర అధ్యక్షుడు చింతాడ సూర్యం, పోలిపల్లి విశ్వవాణి, ఈశ్వరరావు తదితరులు ఈ కార్యక్రమంలో పాల్గొన్నారు.



అంబేద్కర్ విగ్రహం వద్ద నిరసన తెలుపుతున్న దళితసేన

కార్మిక చట్టాలకు ఎస్‌కెఇసి, యుఎఫ్‌సి కాంట్రాక్టర్ల పాతర

ప్రజాశక్తి-కలెక్టరేట్

స్టీల్‌ప్లాంట్‌లోని కెఇసి, యుఎఫ్‌సి కాంట్రాక్టర్లు కార్మిక చట్టాలకు పాతర వేస్తూ కాంట్రాక్టు కార్మికులను తీవ్ర ఇబ్బందులకు గురిచేస్తున్నారని తెలుగు నాడు ట్రేడ్ యూనియన్ కౌన్సిల్ (టిఎన్‌టియుసి) జిల్లా అధ్యక్షులు బొడ్డు పైడిరాజు ఆరోపించారు. ఈ మేరకు పందిమెట్టలో గల సెంట్రల్ లేబర్ కమిషనర్ ఆర్‌ఎన్‌సిపికె.మిశ్రాకు శనివారం వినతిపత్రంను సమర్పించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ స్టీల్‌ప్లాంట్ నిర్మాణం కోసం తమ ఇళ్ళు, భూములు త్యాగం చేసి స్టీల్‌యార్డ్ (సిఎస్‌డి) ఉక్కు నిర్వాసిత కార్మికులను మేస్త్రీలు, సూపర్‌వైజర్లను ప్రయివేటు యాజమాన్యాలైన ఎస్‌కెఇసి, యుఎఫ్‌సి సంస్థలు వేధింపులకు గురిచేస్తున్నాయని ఆరోపించారు. తమ ఇష్టారాజ్యంగా, నియంతృత్వంగా, ఎటువంటి నోటీసులు లేకుండా సర్వీసు కండిషన్స్ మారుస్తూ అన్యాయంగా వ్యవహరిస్తున్నాయని తెలిపారు. 30 ఏళ్లుగా పనిచేస్తున్న మేస్త్రీలను అదే నేచర్‌గల వర్క్‌లో కొనసాగించాలని, కాంట్రాక్టర్ మారినా పాత కార్మికులనే కొనసాగించాలనే నిబంధనలకు తూట్లు పొడుస్తున్న ఎస్‌కెఇసి, యుఎఫ్‌సిలపై చర్యలు గైకొని, కార్మికులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. ఈ కార్యక్రమంలో నంబారు దేముడు, యలమంచిలి అప్పలరాజు, జె జాన్ తదితరులు పాల్గొన్నారు.

వ్యాపారాభివృద్ధికి ముద్రారుణాలు దోహదం

ప్రజాశక్తి-దాబాగార్డెన్స్

చిరు వ్యాపారుల అభ్యున్నతికి ముద్రారుణాలు ఎంతగానో దోహదపడుతున్నాయనిర ఎంపీ కంభంపాటి హరిబాబు అన్నారు. డాబాగార్డెన్స్ సిండికేట్ బ్యాంకులో అర్హులైన లబ్ధిదారులకు శనివారం ముద్రారుణాలు పంపిణీ చేశారు. ఈ కార్యక్రమంలో ఆయన ముఖ్యఅతిథిగా పాల్గొని మాట్లాడారు. ప్రధాన మోడి చిరు, చిల్లర వర్తకుల అభివృద్ధికే ముద్రారుణాలు పెట్టారన్నారు. పేదల సంక్షేమమే ధ్యేయంగా ప్రభుత్వం పనిచేస్తుందన్నారు. బ్యాంకు రీజనల్ మేనేజర్ విజయబాబు మాట్లాడుతూ, గతంలో 150మంది వరకు ముద్రారుణాలు ఇచ్చామని చెప్పారు. ఈ కార్యక్రమంలో బ్యాంకు చీఫ్ మేనేజర్ నరసింహం తదితరులు పాల్గొన్నారు.

మత్స్యకారులను ఎస్‌టిలో చేర్చాలి

దాబాగార్డెన్స్ : మత్స్యకారులందరినీ ఎస్‌టి జాబితాలో చేర్చాలని సీనియర్ న్యాయవాది పుక్కళ్ల నాగరాజు డిమాండ్ చేశారు. డాబాగార్డెన్స్ విజెఎఫ్ ప్రెస్‌క్లబ్‌లో శనివారం ఏర్పాటుచేసిన విలేకర్ల సమావేశంలో ఆయన మాట్లాడుతూ, ఈ విషయమై ఇటీవల విశాఖ వచ్చిన ముఖ్యమంత్రి చంద్రబాబుతో చర్చించేందుకు మత్స్యకారుల సంఘం నాయకులు గెస్ట్‌హౌస్‌కు వెళ్తే అవమానకరంగా మాట్లాడారన్నారు. దీనిపై తక్షణమే ముఖ్యమంత్రి క్షమాపణ చెప్పాలని డిమాండ్ చేశారు. పాలకులు తమను కేవలం ఓటు బ్యాంకుగా వాడుకుంటున్నారని విమర్శించారు. మత్స్యకారులను అవమానించిన చంద్రబాబుపై కేసులు పెడతామన్నారు. ఎమ్మెల్యే వాసుపల్లి గణేష్‌కుమార్ తమ సామాజిక వర్గానికి చెందినవాడైనా ఇటువైపు కన్నెత్తికూడా చూడటం లేదన్నారు. మంత్రులు గంటా, అయ్యన్నలకు సమస్య తెలిసినా వారు కూడా పట్టించుకోవడం లేదని తెలిపారు. ఈ సమావేశంలో సంఘం నాయకులు తెప్పల శాంతారాం, మూగి శ్రీరామమూర్తి, బడే గౌరి పాల్గొన్నారు.

పాత దుస్తుల సేకరణ, పంపిణీ అభినందనీయం

డాబాగార్డెన్స్ : చల్లాజీ ఇన్‌ఫ్రాస్ట్రక్చర్స్ ప్రయివేట్ లిమిటెడ్ ఆధ్వర్యాన పాత దుస్తులను సేకరించి, అభాగ్యులకు పంపిణీ చేయడం అభినందనీయమని ఎమ్మెల్సీ పివిఎన్.మాధవ్ తెలిపారు. పాత దుస్తుల సేకరణకు సంబంధించిన గోడపత్రికను బిజెపి ఎమ్మెల్సీ కార్యాలయంలో మాధవ్ శనివారం ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఓ మంచి సేవా కార్యక్రమాన్ని చేపడుతున్న నిర్వాహకులను ప్రశంసించారు. నేటి తరం యువత విద్యార్థి దశ నుంచే సేవాభావాన్ని అలవర్చుకోవాలని సూచించారు. మంచి కార్యక్రమానికి తప్పకుండా తన సహకారం ఉంటుందన్నారు. ఈ కార్యక్రమంలో సంస్థ ప్రతినిధి మట్లపల్లి అవినాష్, సెయింట్ ల్యూక్స్ ప్రతినిధులు, ఎస్.కార్తిక్, బషీర్, అమూల్, గీతం విద్యార్థులు పాల్గొన్నారు.

జాతీయ పవర్ లిఫ్టింగ్ పోటీలకు ఎంపిక

కలెక్టరేట్ : తమిళనాడులోని కోయంబత్తూరులో నిర్వహించే జాతీయ జూనియర్, మాస్టర్స్ (పురుషుల, మహిళల) పవర్ లిఫ్టింగ్ ఛాంపియన్‌షిప్ 2017-18 పోటీలలో పాల్గొనే ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర జట్టుకు విశాఖ జిల్లా నుంచి పలువురు క్రీడాకారులు ఎంపికయ్యారని విశాఖ డిస్ట్రిక్ట్ పవర్ లిఫ్టింగ్ అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి మద్ది ప్రభాకరరావు తెలిపారు. జూనియర్ విభాగంలో కె.యేసునాథ్, కె.సాయిచరణ్, ఆర్.అరుణ్ సాయికిరణ్, కె.హిమబిందు, ఆర్.పూర్ణిమ, సిహెచ్.నిరుపమ, మాస్టర్స్ విభాగంలో సిహెచ్.శేషుబాబు, వి.అప్పారావు, ఎం.భాస్కరరావు, ఇ.సన్యాసిరావు ఎంపికైనట్లు తెలిపారు. ఎంపికైన క్రీడాకారులను ఎపి వెయిట్ లిఫ్టింగ్ అసోసియేషన్ అధ్యక్షులు కె.సూర్యనారాయణ, ప్రధాన కార్యదర్శి ఎస్.కోటేశ్వరరావు, జిల్లా అధ్యక్షులు పి.శంకరరావు, జాతీయ పవర్ లిఫ్టర్ ఎ.రామారావు తదితరులు అభినందించారు.

సిపిఎస్ విధానం రద్దు చేయాలని వినతి

వడ్డాది : అన్యాయమైన సిపిఎస్ విధానాన్ని రద్దు చేసి, పాత పింఛను విధానాన్ని పునరుద్ధరించాలని కోరుతూ బుచ్చెయ్యపేట మండల ఎపిటిఎఫ్ అధ్యక్ష, కార్యదర్శులు పి.అయ్యన్న, బి.దేముడుబాబు ఇచ్చిన పిలుపుమేరకు జన్మభూమి గ్రామసభల్లో ఉపాధ్యాయులు వినతిపత్రాలను అందించారు. దీనిపై ముఖ్యమంత్రి స్పందించి మంచి నిర్ణయం తీసుకోవాలని వారు కోరుతున్నారు. కార్యక్రమంలో దుర్గాప్రసాద్, జిటికె మూర్తి, శ్రీను తదితరులు పాల్గొన్నారు.

ప్రజాశక్తి
విశాఖ
ఆదివారం 7 జనవరి 2018

సాహసమే శ్వాసగా..



గుడారాల్లో కేరింతలు కొడుతున్న చిన్నారులు

ఓక్రిడ్జ్‌లో సందడిగా శీతాకాల శిబిరం

ప్రజాశక్తి - తగరపువలస

'సాహసం-నాయకత్వ లక్షణాలు'పై ఓక్రిడ్జ్ ఇంటర్నేషనల్ స్కూల్‌లో తలపెట్టిన శీతాకాల శిబిరం శనివారం అత్యంత ఉత్సాహపూరిత వాతావరణంలో సాగింది. 21 విషయాల్లో విద్యార్థులకు అవగాహన కల్పించారు. టార్జాన్ స్వింగ్, ట్రస్ట్ ఫాల్, హాట్ ఎయిర్ బెలూన్, టగ్ ఆఫ్ వార్ లాంటి ఆసక్తికరమైన కార్యక్రమాలు విద్యార్థులను ఎంతో ఉత్తేజపూరితులను చేశాయి. 8-14 ఏళ్లలోపు విద్యార్థులు భయాన్ని వీడి టెంట్‌లో రోజంతా గడిపారు. విద్యార్థులు తమ జీవితంలో క్లిష్ట పరిస్థితులను ఎలా ఎదుర్కోవాలో ఉపాధ్యాయులు తెలియజెప్పారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ బిజ్జు బేబీ మాట్లాడుతూ ఇటువంటి కార్యక్రమాలు విద్యార్థులకు ఎంతో ఉపయుక్తకరమన్నారు. శారీరక దృఢత్వం కలిగి ఉండటానికి నిర్దిష్టమైన నియమావళి ఏర్పాటు చేసుకోవాలని పేర్కొన్నారు. పాఠశాల డైరెక్టర్ అమిత్ జైన్ మాట్లాడుతూ విద్యార్థులు మంచి అనుభవాలను పోగు చేసుకుని స్నేహపూరిత వాతావరణంలో గడిపారని చెప్పారు.



తాడు సహాయంలో కొండలు ఎక్కుతున్న విద్యార్థులు



కనువిందు చేసిన గుడారాలు

గ్రామంలో వ్యవసాయం.. నగరంలో హరినామ స్మరణం

సంక్రాంతి శోభకు హరిదాసులే ప్రథమ పాదం

ప్రజాశక్తి-కలెక్టరేట్

ఉషోదయానికి ముందే పల్లె పట్టులను, నగర వాసులను మేల్కొలుపుతూ చేసే ఆ హరినామ గానం సంక్రాంతి శోభకు ప్రథమ పాదం..!. నిలువెత్తు తెలుగుదనానికి సాక్షాత్కారం..!!. ఒక్క ముక్కలో చెప్పాలంటే సంక్రాంతి అంటేనే హరిదాసులు. ఆధ్యాత్మిక విషయాలను ప్రచారం చేస్తూ రామాయణ పారాయణమే ఊపిరిగా వారు జీవిస్తారు. నోరు విడిచి దానం అడగని వారికి పూట గడవని నిరుపేద అయినా ఏదో నాడు తనకు తోచింది ఇచ్చి మొక్కులు తీర్చుకుంటారు. ఇదో సంప్రదాయంగా నగరంలో ఎంతో కాలం నుంచి వస్తోంది.

తెల్లవారుతుండగానే ఈ ధనుర్మాసంలో పల్లెల్లో ధర్మపాత్రను శిరస్సుపై ఉంచుకొని ఎముకలు కొరికే చలిని సైతం లెక్క చేయకుండా నుదుట హరినామం... మెడలో పూలహారం... కాళ్లకు గజ్జెలు, చేతిన చిడతలు... నెత్తిన కలశం ధరించి 'హరిలో రంగ హరి' అంటూ సనాతన వస్త్రధారణతో హరిదాసులు ఆలపించే సంకీర్తనలు వీనులవిందు కలిగిస్తుంటాయి. ఎవరినీ యాచించే విధంగాకాక భక్తి సంకీర్తనలతో వెళ్లిపోతుండే వీరికి భక్తులు కూడా తమకు తోచిన భిక్ష వేస్తుంటారు. అయితే విశాఖ నగరంలో అధిక ధరలు, పెరిగిన ఇళ్ల అద్దెలు, విద్యుత్ ఛార్జీల భారం, నిరుద్యోగం వంటి ఎన్నో సమస్యలతో ప్రస్తుత జీవనమే కష్టమైన తరుణంలో రాన్రానూ పరిస్థితి మారుతోంది. సంబరాల సందడి కానరావడం లేదు. మారుతున్న సామాజిక, ఆర్థిక స్థితిగతులతో పండుగలు కూడా తమ పూర్వ వైభవాన్ని కోల్పోతున్నాయి. ఈ నేపథ్యంలోనూ సంక్రాంతికి శోభగా మిగిలి అక్కడక్కడా కనిపిస్తున్నది హరిదాసులేనని చెప్పడం అతిశయోక్తి కాదు.



హరిదాసుల యాత్ర ఎలా సాగుతుంది ?

ధనుర్మాసం ప్రారంభం నుంచి ముక్కనుమ వరకూ మాత్రమే హరిదాసులు గ్రామాల్లో, నగర వీధుల్లో హరినామ సంకీర్తన చేస్తుంటారు. హరినామ సంకీర్తన వీరి ధర్మ భిక్షగానం. ఆ నాదమే ఇతరులచే భిక్ష వేయిస్తుంది. తలపై కంచు కలశం ఉన్నంత వరకు వీరు ఎవరితోనూ మాట్లాడరు.

వెళ్లిన ఇంటిని వారు వెనుతిరిగి చూడరు. దక్షిణ, ధర్మం వేయగానే మూడు ప్రదక్షిణాలు చేసి వారు వెళ్లిపోతారు. ఏ దాత దానంతో పాత్ర నిండుతుందో ఆ దాత ఇంటి వద్దనే ధర్మపాత్రలో బియ్యాన్ని దించి తమతో తీసుకుపోతారు.

మిగిలిన రోజుల్లో వ్యవసాయ పనులే..

భూములు, ఆస్తులు లేవు. వ్యవసాయ కూలి పని చేసుకుంటూ జీవిస్తున్నాం. ధనుర్మాసంలో విశాఖ జిల్లాకు నాతోపాటు ఎనిమిది మంది చేరుకున్నాం. ఇక్కడ ఎంపిక చేసుకున్న ప్రాంతాల్లో ధనుర్మాసం ప్రారంభం రోజు నుంచి ముక్కనుమ వరకు వీధుల్లో హరినామ స్మరణగావిస్తూ ధర్మపాత్రలో నిండిన బియ్యం, భక్తులు వేసే నగదుతో తూర్పు గోదావరి జిల్లాలోని ఏలేశ్వరానికి వెళతాం. ధనుర్మాసంతోపాటు, కార్తీక మాసం, మాఘమాసాల్లో కూడా హరినామ కీర్తనలతో భిక్షాటన చేస్తాం. మిగిలిన రోజుల్లో వివిధ ఉత్సవాలకు ప్రభలు కడతాం. వ్యవసాయ పనులు చేస్తూ జీవనం సాగిస్తుంటాం.

తొరిమి సత్యనారాయణ, హరిదాసు, ఏలేశ్వరం



పోస్టర్‌ను ఆవిష్కరిస్తున్న వి-టీం సభ్యులు

సంక్రాంతి వేడుక పోస్టర్ ఆవిష్కరణ

ప్రజాశక్తి-డాబాగార్డెన్స్

వైజాగ్ నెంబర్-1 ఈవెంట్ మేకర్స్ వి-టీం ఈవెంట్స్, వరుణ్ మారుతీ ఆధ్వర్యాన వైజాగ్ సంక్రాంతి పేరిట ఈ నెల 8న వేడుకలను ఘనంగా నిర్వహించనున్నట్లు వి-టీం సిఇఒ వీరుమామ తెలిపారు. దీనికి సంబంధించిన పోస్టర్‌ను శనివారం కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా వి టీం ఈవెంట్స్ హెడ్ రమేష్ కుమార్ మాట్లాడుతూ ముగ్గులు, నడక, సంప్రదాయ వస్త్రధారణ పోటీలు నిర్వహిస్తున్నట్లు చెప్పారు. పోటీల్లో ఎవరైనా ఉచితంగా పాల్గొనవచ్చుని, బహుమతులు ఉంటాయని తెలిపారు. ఆసక్తిగల వారు 9030598236 నెంబరులో సంప్రదించి పేర్లను నమోదు చేసుకోవాలన్నారు. కార్యక్రమంలో లక్ష్మి, ఉమాబద్రీ, సుశీల, డాక్టర్ పల్లవి, శోభారాణి, వి-టీం సిబ్బంది పాల్గొన్నారు.

యువత చేతిలోనే దేశ భవిత

క్యాంపస్ కబుర్లు



నృత్యం చేస్తున్న విద్యార్థిని

విజ్ఞాన్ యువతరంగ్‌లో వక్తలు
అలరించిన సాంస్కృతిక కార్యక్రమాలు

ప్రజాశక్తి - కూర్మన్నపాలెం

విద్యార్థి దశ నుంచి ప్రతి ఒక్కరూ నాయకత్వ లక్షణాలు అలవర్చుకోవాలని విమ్స్ డైరెక్టర్ డాక్టర్ సత్యప్రసాద్ పిలుపునిచ్చారు. దువ్వాడ ఇంజినీరింగ్, ఫార్మసీ, మహిళా కళాశాల సంయుక్తంగా చేపట్టిన యువతరంగ్ - 2018 కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మాట్లాడుతూ ప్రస్తుత పోటీ ప్రపంచానికి అనుగుణంగా శాస్త్ర, సాంకేతిక రంగాలపై అందరూ పట్టు పెంచుకోవాలని కోరారు. క్రీడా, సాంస్కృతిక రంగాలపై నైపుణయం పెంచుకోవాలని చెప్పారు. సమాజం పట్ల గౌరవాన్ని అలవర్చుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్ డైరెక్టర్ ఫైనాన్స్ వివి.వేణుగోపాలరావు మాట్లాడుతూ విద్యార్థులు మేధస్సును, సమాజ చైతన్య భావాలను పెంచుకోవాలని చెప్పారు. దేశ అభివృద్ధిలో యువతదే కీలకపాత్రన్నారు. విజ్ఞాన్ సంస్థ ఛైర్మన్ లావు రత్తయ్య మాట్లాడుతూ విద్యార్థులు క్రమశిక్షణతో కుడిన విద్యతో ఉన్నత శిఖరాలను అధిరోహించొచ్చని తెలిపారు. కార్యక్రమంలో సిఇఒ పవన్‌కృష్ణ, ప్రిన్సిపల్ డాక్టర్ చల్లా నర్సింహం, శేషారావు, వివిధ విభాగాల అధిపతులు, డీన్‌లు



పట్టాలు అందజేస్తున్న సత్యప్రసాద్

నిరుపేదలకు 'ఆసరా'



విద్యార్థులకు బ్యాడ్జీలు అందజేస్తున్న జగదీష్‌బాబు

పదేళ్లుగా సేవా బాటలో అంధ ఉపాధ్యాయుడు వందలాది మంది విద్యార్థులకు సాయం



పాఠశాలకు ఎల్‌సిడి టీవీని బహూకరిస్తున్న జగదీష్ బాబు

ప్రజాశక్తి-పద్మనాభం

ఆయన అంధత్వాన్ని జయించాడు. ప్రభుత్వ ఉద్యోగాన్ని సాధించి ఇతరులకు తానేమీ తక్కువ కాదని నిరూపించాడు. అంతటితో ఆగక సమాజంలోని నిరుపేదల జీవితాల్లో వెలుగులు నింపుతున్నాడు. పదేళ్ల కిందట ఆసరా పేరిట ట్రస్టును స్థాపించి వందలాది మందికి సేవలందిస్తున్నాడు.

మండలంలోని రెడ్డిపల్లి గ్రామానికి చెందిన రెడ్డిపల్లి జగదీష్ బాబు 2008 జనవరి 5న ఆసరా సంస్థను స్థాపించారు. నిరుపేదలకు అండగా నిలవాలన్నది దీని లక్ష్యం. ఇప్పటి వరకూ 153 మందికి ఉద్యోగాలు రావడంలో ఈ ట్రస్టు కీలకపాత్ర పోషించింది. తొలుత గ్రామీణ ప్రాంతాల్లో తెలివైన పేద విద్యార్థులను ట్రస్టు ద్వారా గుర్తిస్తారు. అటువంటి వారికి పుస్తకాలు, ఫీజులు, దుస్తులు అందజేస్తారు. ఇప్పటి వరకూ వెయ్యి మందికి ఈ సేవలు అందించినట్లు జగదీష్ బాబు చెబుతున్నారు.

వైద్య, రక్తదాన శిబిరాలు - పాఠశాలల్లో సేవలు

ఎప్పటికప్పుడు ట్రస్టు ద్వారా రక్తదాన శిబిరాలు ఏర్పాటు చేస్తున్నారు. ఆరోగ్య శిబిరాలు నిర్వహించి ఉచితంగా మందులు అందజేస్తున్నారు. ప్రభుత్వ పాఠశాలల్లో కనీస వసతులు కల్పిస్తున్నారు. రాష్ట్ర వ్యాప్తంగా అంధ విద్యార్థులకు బ్రెయిలీ లిపి పుస్తకాలను ముద్రించి పంపిణీ చేశారు. ఆడియో ఫార్మట్‌లో స్టడీ మెటీరియల్‌ను అందజేశారు. తొలిసారి 2008లో డిఎస్‌సి పరీక్ష నిమిత్తం రాష్ట్ర వ్యాప్తంగా 1250 మందికి ఈ స్టడీ మెటీరియల్ సీడీలను పంపిణీ చేశారు. వీరిలో 153 మంది ఉపాధ్యాయులుగా ఎంపికయ్యారు. ఈ విజయమే జగదీష్ బాబుకు గొప్ప పేరు తీసుకొచ్చింది. ఆ స్ఫూర్తితో గ్రూపు 1, 2, ఇతర సివిల్ పరీక్షలకు కూడా స్టడీ మెటీరియల్‌ను ముద్రించి పంపిణీ చేస్తున్నారు.

ఆదర్శం



ఆర్థిక సాయం అందజేస్తూ..

జీతంలో ఎక్కువ భాగం సేవకే..

సేవలకుగాను పెద్ద మొత్తంలో నిధులు అవసరమైనప్పటికీ ఎప్పుడూ జగదీష్ బాబు వెనుకంజ వేయలేదు. సేవాకాంక్షతో ఒడిదుడుకులను ఎదుర్కొంటూ ముందుకు సాగుతున్నారు. తాను ఉపాధ్యాయునిగా పని చేస్తుండటంతో వచ్చే జీతంలో ఎక్కువ భాగాన్ని సేవా కార్యక్రమాలకే వెచ్చిస్తున్నారు. మరింత మంది దాతలు స్పందించి ఆసరాగా నిలిస్తే తమ సంస్థ ఎక్కువ మందికి అండగా నిలుస్తుందని ఆయన చెబుతున్నారు. పలుసార్లు జిల్లా స్థాయిలో సేవా విభాగంలో సంస్థ ప్రథమ స్థానంలో నిలిచినట్లు తెలిపారు. అందరితో కలుపుగోలుగా ఉండటం, సలహాలు, సూచనలు తీసుకోవడంతోనే ఇంతలా సంస్థ కార్యక్రమాలు విస్తరించాయని ఆయన చెబుతున్నారు.



ఆట వస్తువులను పంపిణీ చేస్తూ..



ప్రదర్శన చేస్తున్న పార్టీ కార్యకర్తలు

చైతన్యపూరితం సిపిఎం బహిరంగ సభ

సిపిఎం జిల్లా మహాసభలను పురస్కరించుకుని అచ్యుతాపురంలో శనివారం జరిగిన బహిరంగ సభ ప్రజల్లో చైతన్యం రేకెత్తించింది. నాయకుల ప్రసంగాలు ఆలోచింపజేశాయి. తొలుత పార్టీ శ్రేణులు భారీ ప్రదర్శన నిర్వహించాయి. పిఎన్‌ఎం కళాకారుల గేయాలు ఉత్తేజపరిచాయి. కదం తొక్కుతూ.. పదం పాడుతూ సాగిన మహిళా నృత్యాలు అందరినీ అలరించాయి.



వృద్ధురాలిని పలకరిస్తున్న సిపిఎం నాయకులు సిహెచ్.నర్సింగరావు



గేయాలు ఆలపిస్తున్న ప్రజా నాట్యమండలి కళాకారులు



కోలాటం ఆడుతున్న మహిళలు



బృంద నృత్యం చేస్తున్న మహిళా సభ్యులు

ఎన్నికల వాగ్దానాలను అమలు చేస్తాం

- మంత్రి గంటా శ్రీనివాసరావు - 35, 36, 37 వార్డుల్లో జన్మభూమి కార్యక్రమం

ప్రజాశక్తి-విశాఖపట్నం

ఎన్నికల్లో ప్రజలకిచ్చిన వాగ్దానాలను తప్పకుండా అమలు చేస్తామని రాష్ట్ర హెచ్ఆర్డి మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఉత్తర నియోజకవర్గ పరిధిలోని జివిఎంసి 35, 36, 37 వార్డుల పరిధిలో శనివారం నిర్వహించిన జన్మభూమి మా ఊరు కార్యక్రమాలకు ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. రాష్ట్రం విడిపోయిన తర్వాత ఆర్థికంగా నష్టపోయినప్పటికీ ముఖ్యమంత్రి మొక్కవోని దీక్షతో సంక్షేమ పథకాలను అమలు చేస్తున్నారన్నారు. పెద్దమొత్తంలో రూ.24,500ల కోట్ల మేర రైతు రుణమాఫీని అమలు చేశారన్నారు. రాజకీయాలకు అతీతంగా అర్హులైన వారందరికీ పింఛన్లు, రేషన్‌కార్డులను అందిస్తున్నామన్నారు. విశాఖ పార్లమెంటు సభ్యుడు కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ ప్రజల సంక్షేమమే ధ్యేయంగా కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు పలు సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నారన్నారు. సంక్షేమ ఫలాలు అందని అర్హులకు వాటిని చేరువ చేసేందుకు జన్మభూమి కార్యక్రమం దోహదపడుతుందన్నారు. కేంద్ర ప్రభుత్వం విశాఖ జిల్లాకు రెండు ప్రతిష్టాత్మక విద్యాసంస్థలు ఐఐఎం, పెట్రోలియం యూనివర్సిటీలను తీసుకొచ్చిందన్నారు. రూ.20 వేల కోట్లతో హెచ్‌పిసిఎల్ విస్తరణ పనులు, ఆనందపురం - అనకాపల్లి హైవే అభివృద్ధి, ఎన్ఎడి ఫ్లైఓవర్ నిర్మాణం తదితర పనులతో పాటు ఐటి, పర్యాటక రంగ అభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారన్నారు. జిల్లా కలెక్టర్ ప్రవీణ్‌కుమార్ మాట్లాడుతూ జన్మభూమిలో వస్తున్న దరఖాస్తులను ఏ రోజుకు ఆ రోజు ఆన్‌లైన్ అప్‌లోడ్ చేస్తున్నామన్నారు. వాటికి సత్వర పరిష్కారమివ్వడమే లక్ష్యంగా పని చేస్తున్నామన్నారు. కార్యక్రమానికి అధ్యక్షత వహించిన ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజు మాట్లాడుతూ అర్హులందరికీ సంక్షేమ పథకాలను చేరువ చేస్తామన్నారు. నియోజకవర్గ పరిధిలో 9 వేల మందికి ఇళ్ల పట్టాలను పంపిణీ చేశామన్నారు. బీమా పథకంలో ప్రతి ఒక్కరూ పేరు నమోదు చేసుకుని ప్రభుత్వం అందించే సంక్షేమ పథకాలను వినియోగించుకోవాలన్నారు. అనంతరం సామూహిక సీమంతాలు, ముఖ్యమంత్రి సహాయనిధి చెక్కుల పంపిణీ, చంద్రన్న సంక్రాంతి కానుకలను అందజేశారు. కార్యక్రమంలో జివిఎంసి కమిషనర్ హరినారాయణన్, అదనపు కమిషనర్ జివివిఎస్ఎన్ మూర్తి, అర్బన్ తహశీల్దార్ నాగభూషణం, జన్మభూమి కమిటీ సభ్యులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న మంత్రి గంటా



సిఐటియు ఆధ్వర్యాన నిరసన వ్యక్తం చేస్తున్న కార్మికులు

కాంట్రాక్టు కార్మికుల తొలగింపు అన్యాయం

ప్రజాశక్తి-కంచరపాలెం

ఈస్ట్‌కోస్ట్ రైల్వే విశాఖపట్నం ఎన్‌సిసిలో వాషింగ్‌లైన్ రైల్వే కోచ్ క్లీనింగ్ చేస్తున్న 60 మంది కాంట్రాక్టు కార్మికులను ఏకపక్షంగా విధుల నుంచి తొలగించిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని ఈస్ట్‌కోస్ట్ రైల్వే కాంట్రాక్ట్ వర్కర్స్ యూనియన్(సిఐటియు) డిమాండ్ చేసింది. ఈ మేరకు శనివారం రైల్వే ఎన్‌సిసి కార్యాలయం వద్ద నిరసన చేపట్టారు. ఈ సందర్భంగా యూనియన్ ప్రధాన కార్యదర్శి సింహాచలం మాట్లాడుతూ గత పది సంవత్సరాలుగా విధులు నిర్వర్తిస్తున్న కార్మికులను కొత్తగా వచ్చిన కాంట్రాక్టరు తొలగించడం అన్యాయమన్నారు. కాంట్రాక్టర్లు మారినప్పటికీ పాత కార్మికులే ఇప్పటి వరకు విధులు నిర్వర్తించారన్నారు. రెండు నెలలుగా జీతాలు ఇవ్వకుండా 60 మంది కార్మికులను వేధించి చివరకు తొలగించారని ఆవేదన వ్యక్తం చేశారు. కొత్తగా వచ్చిన కాంట్రాక్టరు పనిలోకి కొంత మందిని తీసుకుంటున్నారనీ, వారి నుంచి రూ.50 వేల నుంచి రూ.లక్ష వరకు వసూలు చేస్తున్నారని ఆరోపించారు. తొలగించిన వారిని విధుల్లోకి తీసుకోవాలంటే రూ.50 వేల చొప్పున చెల్లించాలని డిమాండ్ చేస్తున్నట్లు వివరించారు. కాంట్రాక్టరు చర్యల వల్ల తొలగించబడిన కార్మికులు తీవ్ర వేదనకు గురవుతున్నారని వాపోయారు. సంక్రాంతి పండగ సమయంలో వారి కుటుంబాలు రోడ్డున పడ్డాయనీ, వారి పిల్లలు చదువుకు దూరమయ్యారనీ చెప్పారు. కార్మికులను తొలగించిన కాంట్రాక్టరుపై చర్యలు తీసుకోవాలని రైల్వే ఉన్నతాధికారులకు, లేబర్ డిపార్ట్‌మెంట్ అధికారులకు విజ్ఞప్తి చేశారు.



బహుమతులను పంపిణీ చేస్తున్న కృష్ణారెడ్డి

మహిళలకు సంక్రాంతి ముగ్గుల పోటీలు

సీతమ్మధార: ఉషోదయ చారిటబుల్ ట్రస్ట్ ఆధ్వర్యాన శనివారం అబిద్‌నగర్ కార్యాలయంలో సంక్రాంతి పండగ పురస్కరించుకుని మహిళలకు ముగ్గుల పోటీలు నిర్వహించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన టిడిపి నాయకులు స్వాతి ప్రమోటర్స్ సంస్థ చైర్మన్ మేడపాటి కృష్ణారెడ్డి విచ్చేసి మాట్లాడారు. సంక్రాంతి పండగ అంటేనే మహిళలు ఎంతో ఆనందంగా జరుపుకుంటారన్నారు. ఇటువంటి ముగ్గుల పోటీల ద్వారా వారిలో ఉన్న ప్రతిభను గుర్తించొచ్చని పేర్కొన్నారు. ప్రతి ఒక్కరూ సంక్రాంతి పండగ ఆనందంగా జరుపుకోవాలని ఆకాంక్షించారు. అనంతరం ముగ్గుల పోటీల్లో గెలిచిన వారికి బహుమతులు అందజేశారు. మొదటి బహుమతి ఎస్ ప్రత్యూష, ద్వితీయ బహుమతి ఎం అశ్విని, తృతీయ బహుమతి కె సంధ్యకు అందించారు. కార్యక్రమంలో ట్రస్టు అధ్యక్షులు కొయిలాడ మురళి, కన్వీనర్ కొయిలాడ నవ్య, ఎం వీరస్వామి, కె స్వర్ణలత, ఎ కుసుమ, గౌరి తదితరులు పాల్గొన్నారు.

వేడుకగా గ్యార్వీ షరీఫ్ ఉర్సు ఉత్సవాలు



ముస్లిం సోదరులతో కలిసి ప్రార్థనలు చేస్తున్న ఎమ్మెల్యే

కంచరపాలెం : గ్రేటర్ విశాఖ 40వ వార్డు పరిధి డాక్టర్ జాకీర్ హుస్సేన్ నగర్ మస్జిద్ -ఈ -అల్ ఖాదిర్ గ్యార్వీ షరీఫ్ ఉర్సు ఉత్సవాలను శనివారం వేడుకగా నిర్వహించారు. వరుసగా రెండు రోజుల పాటు నిర్వహించిన ఈ ఉత్సవాలకు పరిసర ప్రాంతాల నుంచి ముస్లిం సోదరులు, మహిళలు, చిన్నారులు పెద్ద ఎత్తున తరలచ్చారు. కార్యక్రమంలో భాగంగా సాయంత్రం చిన్నారులు నాతే ఖలంలను ఆలపించారు. అనంతరం నిర్వహించిన తక్రిర్ కార్యక్రమానికి నగరంలోని పలు మసీదుల నుంచి మౌలానాలు, ముస్లిం మత పెద్దలు హాజరై ఖురాన్‌లో సూక్తులను వివరించారు. కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరైన ఉత్తర నియోజక వర్గం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు ముస్లిం సోదరులు ఘనస్వాగతం పలికారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ముస్లిములు ఎంతో భక్తి శ్రద్ధలతో నిర్వహిస్తున్న గ్యార్వీ షరీఫ్ ఉర్సు ఉత్సవాలకు తనను ఆహ్వానించడం ఎంతో అనందంగా ఉందన్నారు. గ్రామాభివఅద్ధికి తనవంతు సహకారాన్ని పూర్తి స్థాయిలో అందిస్తామని హామీనిచ్చారు. అనంతరం ఎమ్మెల్యే విష్ణుకుమార్ రాజుకు మసీదు కమిటీ సభ్యులు శాలువాతో సత్కరించారు. ఈ కార్యక్రమంలో భాగంగా నిర్వహించిన అన్నసమారాధన కార్యక్రమానికి మర్రిపాలెం పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద ఎత్తున తరలచ్చారు. కార్యక్రమానికి ఉర్సు కమిటీ అధ్యక్షులు షేక్ నూరి పర్యవేక్షించారు. కార్యక్రమంలో ప్రముఖ న్యాయవాది, కోస్తా ఆంధ్ర యోధుల సంఘం కన్వీనర్ ఐఎం అహ్మద్, మసీదు కమిటీ అధ్యక్షులు ఉస్మాన్ అలీ, ఉపాధ్యక్షులు మహమ్మద్ సర్వర్, కార్యదర్శి అన్సర్ వలి, ఉర్సు కమిటీ సభ్యులు మున్నా, జిలానీ, ఖాజా నిజాముద్దీన్, సలీమ్, దాదా, ఖమ్రుద్దీన్ పెద్ద సంఖ్యలో ముస్లిములు పాల్గొన్నారు.

చేనేత వస్త్రప్రదర్శనలో 30 శాతం రాయితీ

సీతమ్మధార : ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ గుర్తింపు కలిగిన చేనేత సహకార సంఘం ఆధ్వర్యాన శంకరమఠం ఎదురుగా పద్మశాలి భవన్‌లో నిర్వహిస్తున్న వస్త్ర ప్రదర్శనలో 30 శాతం రాయితీకి అమ్మకాలు సాగిస్తున్నట్లు నిర్వాహకులు బంగారు రాజు తెలిపారు. ఈ నెల 16వ తేదీ వరకు ప్రతిరోజు ఉదయం 10 గంటల నుంచి రాత్రి 9 గంటల వరకు వస్త్ర ప్రదర్శన ఉంటుందన్నారు. సంక్రాంతి నేపథ్యంలో 30 శాతం రాయితీ ఇస్తున్నట్లు తెలిపారు. మంగళగిరి డ్రెస్ మెటీరియల్స్, పోచంపల్లి ప్యూర్ స్కిల్స్ శారీస్, పోచంపల్లి డ్రెస్ మెటీరియల్స్ కలంకారీ ప్యూర్ సిల్క్స్, శారీస్ బెడ్‌షీట్స్ దివాన్ కాట్స్ మొదలగు వస్త్రాలు అందుబాటులో ఉంటాయన్నారు.



వార్డులను ప్రారంభిస్తున్న మంత్రి అయ్యన్నపాత్రుడు

'ప్రథమ' హాస్పిటల్‌లో ఆరోగ్య పథకం

సీతమ్మధార : ప్రథమ హాస్పిటల్‌లో నూతన వార్డులను, కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులకు ఆరోగ్య పథకం రిజిస్ట్రేషన్, ఓపీడీ చాంబర్లను వార్డులను రాష్ట్ర రహదారుల, భవనాల శాఖా మంత్రి చింతకాయల అయ్యన్నపాత్రుడు శనివారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ పథకం ద్వారా కేంద్ర ప్రభుత్వ ఉద్యోగులు, పెన్షనర్లు, అనుభవజ్ఞులైన వైద్య బృందం కలిగిన ప్రథమ హాస్పిటల్‌లో క్యాష్‌లెస్ ట్రీట్‌మెంట్ పొందే సౌలభ్యం ఉందన్నారు. ఈ పథకాన్ని అందుబాటులోకి తీసుకొచ్చినందుకు ఆసుపత్రి మేనేజ్‌మెంట్‌ను అభినందించారు. ప్రథమ హాస్పిటల్ మేనేజింగ్ డైరెక్టర్ డాక్టర్ పి విశ్వేశ్వరరావు మాట్లాడుతూ 600 పడకలు, గుండె పరీక్షలు కాథ్‌లాబ్ 1.5 టెస్లా, ఎంఆర్ఐ 128 సైస్ సిటి స్కాన్, అడ్వాన్స్‌డ్ ఇంటర్నేషనల్ రేడియాలజి సర్వీసెస్ మెమోగ్రఫీ, స్వీస్ లాగ్ టెక్నాలజీ మొదలైన రాష్ట్రంలోనే ఎక్కడ లేనంతగా అత్యాధునిక శాస్త్ర సాంకేతిక సదుపాయాలు మరెన్నో స్థాపించడం ప్రశంసనీయమన్నారు. నిత్యం వైద్యులు అందుబాటులో ఉంటారని తెలిపారు. ఈ పథకం ద్వారా ఐవిఎఫ్, ఫెర్టిలిటీ ట్రీట్‌మెంట్లు మినహాయించి మిగతా అన్ని ట్రీట్‌మెంట్లను కేంద్ర ప్రభుత్వం ఉద్యోగులు, పెన్షనర్లు పొందొచ్చని తెలిపారు. ఈ కార్యక్రమంలో ఎమ్మెల్యే వెలగపూడి రామకృష్ణబాబు, కలెక్టర్ ప్రవీణ్‌కుమార్, ప్రథమ హాస్పిటల్ డైరెక్టర్లు, ఇతర వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

అందరికీ ఉపయోగకరంగా మిద్దెతోట పుస్తకం



పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న యార్లగడ్డ

సీతమ్మధార : పర్యావరణ మార్గదర్శి వైశాఖి చేస్తున్న కార్యక్రమాలు అభినందనీయమని పద్మభూషణ్ యార్లగడ్డ లక్ష్మీ ప్రసాద్ అన్నారు. ఈ మేరకు విశాఖ పౌరగ్రంథాలయంలో శనివారం నిర్వహించిన కార్యక్రమలో రైతు నేస్తం ఫౌండేషన్ వ్యవస్థాపకుడు వెంకటేశ్వరరరావు రచించిన మిద్దెతోట పుస్తకాన్ని ఆయన ముఖ్యఅతిథిగా హాజరై ఆవిష్కరించారు. ఈ పుస్తకం వల్ల చాలా ప్రయోజనాలున్నాయన్నారు గతంలో విజయవాడలో కూడా ఈ కార్యక్రమాన్ని చేపట్టారని గుర్తు చేశారు. మన కూరగాయల తోట కార్యక్రమాన్ని నగరమంతటా విజయవంతంగా నిర్వహించాలని పర్యావరణ మార్గదర్శి వైశాఖి సంస్థ చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. సంస్థ అధ్యక్షుడు సూరపనేని విజయకుమార్ మాట్లాడుతూ విత్తనాల ప్రదర్శన, రసాయన ఎరువులు, రసాయన కలుపుతీత మందులతో పండిన హైబ్రిడ్, సీడ్‌లెస్ పంటలతో మొహం మొత్తినవారు, రుచిగా లేవని బాధపడేవారు ప్రస్తుతం దేశీయ సాంప్రదాయ విత్తనాలతో పండిన పంటలను కోరుకుంటున్నారన్నారు. దాని కోసం అనేక కార్యక్రమాలతో పాటు విత్తనప్రదర్శనలు ఏర్పాటు చేస్తున్నామన్నారు. అలాగే ఎరువులతో తయారు చేసిన గోళాలు, కూరగాయల తోటల చిత్రాల ప్రదర్శన ఎంతగానో ఆకట్టుకుంది. అనంతరం మార్టేరు వ్యవసాయ పరిశోధనా కేంద్రం విశ్రాంత శాస్త్రవేత్త ఎస్ శివరామప్రసాద్ అధ్యక్షతన నిర్వహించిన ఉచిత శిక్షణ కార్యక్రమంలో మిద్దెతోట పుస్తక రచయిత తుమ్మేటి రఘోత్తమ రెడ్డి, రైతు నేస్తం ఫౌండేషన్ చైర్మన్ వెంకటేశ్వరరావు, రైతుమిత్ర ట్రస్టు వ్యవస్థాపకులు కర్రి రాంబాబు, ఉషా గణపతిరాజు తదితరులు పలువురికి సూచనలిచ్చారు. అనంతరం సంస్థ ఏర్పాటు చేసిన విత్తన ప్రదర్శను పలువురు తిలకించారు.

సంక్షేమ ఫలాలు ప్రతి ఒక్కరికీ చేరువకావాలి

- రాష్ట్ర హెచ్‌ఆర్‌డి మంత్రి గంటా శ్రీనివాసరావు - డ్వాక్రా మహిళలకు చెక్కుల పంపిణీ


డ్వాక్రా మహిళలకు చెక్కులను పంపిణీ చేస్తున్న మంత్రి గంటా, ఎంపీ హరిబాబు

ప్రజాశక్తి-గోపాలపట్నం

తెలుగుదేశం ప్రభుత్వ హయాంలో సంక్షేమ ఫలాలు అందరికీ అందాలన్నదే ముఖ్యమంత్రి చంద్రబాబు లక్ష్యమని మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 66వ వార్డు వెంకటాపురంలో 'జన్మభూమి – మా ఊరు' కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ మూడున్నరేళ్లలో 30 ఏళ్ల అభివృద్ధి జరిగిందని అన్నారు. విద్య, వైద్యం పూర్తిగా పేద, మధ్య తరగతి ప్రజలకు అందాలన్నదే తెలుగుదేశం లక్ష్యమని చెప్పారు. చంద్రన్న బీమా పేద ప్రజలకు ధీమాగా మారిందని చెప్పారు. ఎంపీ కంభంపాటి హరిబాబు మాట్లాడుతూ కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు అనేక సంక్షేమ పథకాలు ప్రవేశపెట్టి ప్రజలకు చేరువయ్యేలా కృషి చేస్తున్నాయని చెప్పారు. స్థానిక ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ పెతకంశెట్టి గణబాబు మాట్లాడుతూ గోపాలపట్నంలో రెండు నెలల్లో తహశీల్దార్ కార్యాలయం రానున్నదన్నారు. దీంతో ఇక్కడి ప్రజల ఇబ్బందులు తొలగనున్నాయని చెప్పారు. గోపాలపట్నంలోని 30 పడకల ఆసుపత్రి నేడు ఘోషా ఆసుపత్రిలాగా స్త్రీలకు మెరుగైన సేవలందిస్తోందని పేర్కొన్నారు. సాధికార మిత్ర ద్వారా మరింత ప్రజలకు మెరుగైన సేవలు అందించే దిశగా కృషి చేస్తున్నట్లు వివరించారు. ప్రతి ఇంటికి మరుగుదొడ్డి నిర్మాణం పెద్దఎత్తున చేపట్టామనీ, ఇంకా ఎవరైనా మరుగుదొడ్లు కట్టుకోలేకపోతే జన్మభూమిలో అర్జీలు పెట్టుకుంటే ప్రభుత్వం వెంటనే నిధులు మంజూరు చేస్తుందని తెలిపారు. విశాఖ నగరం దేశంలోనే స్వచ్ఛత విషయంలో మూడో స్థానంలో ఉందని వివరించారు. విశాఖ రైల్వేస్టేషన్ నెంబర్ వన్ స్థానంలో ఉందని గుర్తు చేశారు. ప్రభుత్వం పెద్ద ఎత్తున అటు అభివృద్ధి ఇటు సంక్షేమం సమపాళ్లలో అమలు చేస్తూ ప్రజలకు సేవలందిస్తోందన్నారు. అయితే వీటికి అన్నింటికీ ప్రజల సహకారం ఉంటే ప్రభుత్వం మరింత మెరుగైన పాలన అందిస్తుందని చెప్పారు. ఈ కార్యక్రమంలో వుడా వైస్ చైర్మన్ బసంత్‌కుమార్, జివిఎంసి ఎడిసి వర్మ, ఆర్ జోన్ కమిషనర్ సత్యనారాయణ, ఎసిపి రామలింగేశ్వర రెడ్డి, గోపాలపట్నం సిఐ వైకుంఠరావు, తెలుగుదేశం పార్టీ నాయకులు నందవరపు సోములు, బొడ్డేటి విజయ్‌కుమార్, మొజ్జాడ విమల, స్థానిక పెద్దలు ప్రజలు పాల్గొన్నారు.

మల్కాపురం : గర్భిణులు పౌష్టికాహారాన్ని తీసుకోవాలని టిడిపి అధ్యక్షుడు మజ్జి సోమేష్, ఉపాధ్యక్షుడు మాలినాయుడు అన్నారు. జివిఎంసి 49వ వార్డు పరిధి మల్కాపురం, దుర్గానగర్ ప్రాంతాల్లో ఐదో విడత జన్మభూమి కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా గర్భిణులకు సీమంతం కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ కార్యక్రమంలో జివిఎంసి బిల్డింగ్ ఇన్‌స్పెక్టర్ ఉమామహేశ్వరరావు, నాయకులు నీలాపు జోజి, లారా, ఎస్ శ్రీలక్ష్మి, కాకి పోలిరెడ్డి, చింతలపూడి సత్యనారాయణ పాల్గొన్నారు.


సామూహిక సీమంతం నిర్వహిస్తున్న టిడిపి నేతలు

ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు

ఎస్.రాయవరం : జాతీయ రహదారిపై ప్రమాదాల నివారణకు ప్రత్యేక చర్యలు చేపట్టాలని నర్సీపట్నం ఎఎస్‌పి కె అరీఫ్‌హఫీజ్ సూచించారు. అడ్డురోడ్డులో నక్కపల్లి సర్కిల్ కార్యాలయానికి శనివారం వచ్చిన ఆయన హైవే పెట్రోలింగ్, యలమంచిలి, నక్కపల్లి, సర్కిళ్ల పరిధిలోని పోలీస్ స్టేషన్ల సిబ్బంది, జాతీయ రహదారి అధికారులతో సమావేశమయ్యారు. యలమంచిలి మండలం కొక్కిరాపల్లి నుండి పాయకరావుపేట మండలం తాండవ బ్రిడ్జి వరకు విస్తరించి ఉన్న జాతీయ రహదారిపై 33 చోట్ల ప్రమాదాలు జరిగే ప్రాంతాలను గుర్తించామని తెలిపారు. అవకాశం ఉన్న చోట ఆయా పంచాయతీలను అనుసంధానించుకుని లైటింగ్ ఏర్పాటు చేయాలన్నారు. ముఖ్యమైన కూడళ్లలో ట్రాఫిక్ సిగ్నలింగ్‌ను ఏర్పాటు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. అనంతరం నక్కపల్లి సర్కిల్ కార్యాలయంలో రికార్డులను పరిశీలించారు. ఆయన వెంట యలమంచిలి రూరల్ సబ్ ఇన్‌స్పెక్టర్ రాము, టౌన్ ఇన్‌స్పెక్టర్ జి నారాయణరావు, నక్కపల్లి ఎస్ఐ సింహాచలం నాయుడు, ఎఎస్ఐ రామ్‌మోహనరావు, జాతీయ రహదారుల నిర్వాహణ ఇంజినీరు నాగేశ్వరరావు, తదితరులు పాల్గొన్నారు.

రేషన్ బియ్యం విక్రయిస్తే కఠిన చర్యలు

మాడుగుల : తెలుపు రేషన్‌కార్డులు దారులు కోటా ద్వారా తీసుకుంటున్న బియ్యాన్ని విక్రయిస్తే చర్యలు తప్పవని ఎపి ఆహార సంఘం సభ్యులు ఎల్‌బి.వెంకటరావు హెచ్చరించారు. శనివారం మండల కేంద్రంలోని రేషన్‌డిపోలను సందర్శించిన ఆయన మాట్లాడుతూ రేషన్ డిపోల ద్వారా గతంలో కంటే నాణ్యమైన బియ్యాన్ని పంపిణీ చేస్తున్నామని, అయితే ఈ బియ్యాన్ని కార్డుదారులు ఎవరికైనా విక్రయించినట్లయితే వారి రేషన్‌కార్డులను రద్దుచేస్తామన్నారు. కొన్న వారిపై కేసులు నమోదుచేస్తామని హెచ్చరించారు. ప్రస్తుతం బియ్యంతోపాటు, పంచదార సరఫరా ప్రారంభించామని, మార్చినెల నుండి కిరోసిన్ కూడా పునరుద్ధరిస్తామన్నారు. గోధుమలు, గోధుమపిండి, కందిపప్పు సైతం పంపిణీ చేసే ఆలోచన ప్రభుత్వానికి ఉందన్నారు. మండల కేంద్రాలలో విలేజ్‌మాల్స్ ఏర్పాటుకు ప్రయత్నాలు జరుగుతున్నాయన్నారు. కార్యక్రమంలో సివిల్‌సప్లయి డిటి లారెన్స్, సర్పంచ్ వెంకటలక్ష్మీసూర్యారావు, వైస్ ఎంపిపి పెరుమాళ్ల వెంకటరావు, డీలర్ల సంఘం ప్రతినిధి చింతలమూర్తి తదితరులు పాల్గొన్నారు.

రూ.37లక్షల విలువైన లక్ష్మీదేవి ప్రతిమ బహూకరణ


ప్రతిమను బహూకరిస్తున్న మాజీ ఎమ్మెల్యే మళ్ల, దొడ్డి కిరణ్

గోపాలపట్నం, సింహాచలం : సింహాద్రిపై కొలువుదీరిన వరాహ లక్ష్మీనృసింహస్వామికి రూ.37 లక్షల విలువైన లక్ష్మీదేవి బంగారు ప్రతిమను జివిఎంసి 66వ వార్డు వైసిపి నాయకులు దొడ్డి కిరణ్ బహూకరించారు. ఈ మేరకు శనివారం తమ కుటుంబ సభ్యులు, వైసిపి నగర అధ్యక్షుడు మళ్ల విజయప్రసాద్, వైసిపి అభిమానులు, కార్యకర్తలతో కలిసి కాలి నడకలో సింహాద్రి చేరుకున్నారు. పాదయాత్రలో భాగంగా తప్పెటుగుళ్లు సాముగరిడీలు, భజన బృందంచేసిన నృత్యాలు పలువుర్ని ఆకట్టుకున్నాయి. అనంతరం స్వామివారి సన్నిధికి చేరుకొని బంగారాన్ని బహూకరించారు. అనంతరం సుమారు మూడువేల మందికి అన్నదానం చేశారు. తాను బహూకరించిన లక్ష్మీదేవి ప్రతిమను విరాళంగా కార్యనిర్వాహణాధికారి కోదూరి అచ్యుత రామచంద్రమోహన్‌కు అందజేశారు. ఆయనకు ఆలయాధికారులు సాంప్రదాయబద్ధంగా స్వాగతం పలికారు. స్వామివారి ప్రత్యేక దర్శనం, వేద పండితులచే ఆశీర్వచనం చేయించి ప్రసాదాలను అందజేశారు. స్వామివారికి భక్తులు, దాతలు ఏమైనా వస్తువులు, ధన, చెక్కు, డిడి రూపేణా విరాళమిస్తే సంబంధిత అధికారి వద్ద తగు రసీదు పొందాలని లేదంటే వారు ఇచ్చిన విరాళాలు స్వామివారికి చెందవు అని అధికారులు ఓ ప్రకటనలో తెలిపారు. డిపాజిట్ చేసిన మొత్తం నుంచి వచ్చిన వడ్డీతో భక్తులు కోరిన రోజు అన్నదానం నిర్వహిస్తామన్నారు. దాతలకు ఎటువంటి సమాచారం కావాలన్నా 9491000635 నెంబర్‌ను సంప్రదించాలని లేని పక్షంలో దేవస్థానం కార్యనిర్వాహణాధికారి వారిని సంప్రదించాలని ఆలయ ఈవో రామచంద్రమోహన్ కోరారు.

ఆకట్టుకున్న విద్యార్థుల సైన్స్ ఎగ్జిబిషన్

ఆనందపురం : విద్యార్థులు ప్రాథమిక స్థాయి నుంచే నైతిక విలువలు అలవర్చుకోవాలని బిఆర్ అంబేద్కర్ యూనివర్సిటీ విసి ఆచార్య కె రాంజీ అన్నారు. మండలంలోని గుడిలోవ విజ్ఞాన విహార విద్యాలయంలో శనివారం నిర్వహించిన కళావైజ్ఞానిక ప్రదర్శనలు ప్రారంభించి మాట్లాడారు. బాల్యంలో అభ్యసించిన నైతిక విలువలే జీవితాన్ని తీర్చిదిద్దుతాయన్నారు. మహాపురుషుల జీవితాల ద్వారా ప్రేరణ పొంది జీవన విలువలు పెంచుకోవాలన్నారు. విదేశీ వ్యవహారాల మంత్రిత్వశాఖకు సంబంధించి ఇండియా సెంటర్ ఫర్ మైగ్రేషన్ సిఇఒ విజ్ఞాన విహార పూర్వవిద్యార్థి తీగల భాస్కర్ మాట్లాడుతూ పాఠశాల ఒక దేవాలయం వంటిదనీ, దీని ద్వారా మంచి విలువలు నేర్చుకొని జీవితాన్ని తీర్చిదిద్దుకోవాలని కోరారు. తర్వాత ప్రముఖ రచయిత్రి, శాస్త్రవేత్త డాక్టర్ పూసర్ల రామహరిత మాట్లాడుతూ విద్యార్థులు సృజనాత్మకతను పెంచుకొని నూతన ఆవిష్కరణలకు శ్రీకారం చుట్టాలన్నారు. పెట్రోలియం శుద్ధీకరణ, జియో థర్మల్ పవర్ ప్లాంట్ ఉపయోగాలు, హైపర్ సోనిక్ బ్రహ్మోస్ క్షిపణి ప్రయోజనాలు, న్యూక్లియర్ సబ్‌మెరైన్ నమూనా శాటిలైట్ టెక్నాలజీ ద్వారా చేపల పెంపకం, ఇంటర్నెట్ ఉపయోగాలు, ఈజిప్టు పిరమిడ్స్ మమ్మీస్ ప్రదర్శన, అక్షరధామ్ ఆకృతి, చిత్తోడ్ రాణా ప్రతాప్ కోట వంటి ప్రదర్శనలు విశేషంగా ఆకట్టుకున్నాయి. విజ్ఞాన విహార కమిటీ చైర్మన్ సుబ్రమణ్య శర్మ, ప్రిన్సిపాల్ విజయ్‌కుమార్ పర్యవేక్షణలో 428 మంది విద్యార్థులు 44 ప్రదర్శనలు ఏర్పాటు చేశారు.


సైన్స్ ఎగ్జిబిషన్‌ను తిలకిస్తున్న విసి రాంజీ తదితరులు



ఎన్ఎస్ఎస్ వలంటీర్లతో ఇపిఎస్ భాగ్యలక్ష్మి

యువత సేవా కార్యక్రమాల్లో పాల్గొనాలి

ప్రజాశక్తి-మల్కాపురం

విద్యార్థి దశ నుంచే యువత సేవా కార్యక్రమాల్లో చురుగ్గా పాల్గొనాలని సెయింట్ ఆన్స్ కళాశాల సుపీరియర్ సిస్టర్ జయశీల అన్నారు. ఈ మేరకు కళాశాల ఎన్ఎస్ఎస్ విభాగం ఆధ్వర్యాన యూనిట్ 1, 2, 3లు సంయుక్తంగా జివిఎంసి 48వ వార్డులో బర్మాకాలనీ, ఇందిరా కాలనీ 1, 2లలో ఏర్పాటు చేసిన వారం రోజుల ప్రత్యేక సేవా శిబిరాలను ఆమె ప్రారంభించారు. అనంతరం ఆమె మాట్లాడుతూ సేవా కార్యక్రమాల వల్లే దేశం అభివృద్ధి చెందుతుందని, వ్యక్తిత్వం వికసిస్తుందని, సమాజం పట్ల అవగాహన పెరుగుతుందని తెలిపారు. మానవ సేవా మాధవ సేవ అని సేవల వల్ల మాత్రమే సామాన్యుల స్థితిని మెరుగుపర్చగలమని పేర్కొన్నారు. వారం రోజుల పాటు వార్డుల్లో తిరిగి ప్రజల కష్టాలను తెలుసుకుని, వాటిని పరిష్కరించడానికి ప్రణాళికలు రూపొందించాలని సూచించారు. సమావేశానికి అధ్యక్షత వహించిన ఎన్ఎస్-ఎస్ జిల్లా ప్రోగ్రాం అధికారి ఇపిఎస్ భాగ్యలక్ష్మి మాట్లాడుతూ సేవా శిబిరంలో సామాజిక అంశాలతో పాటు యువజన వ్యవహారాలపై ప్రత్యేక దృష్టిసారిస్తామని వివరించారు. జన్మభూమి కార్యక్రమాల్లో వలంటీర్లు చురుగ్గా పాల్గొని పలువురి ప్రశంసలు పొందాలని ఆకాంక్షించారు. సమావేశంలో జాతీయ సేవా పథకం యూనిట్ 2 ప్రోగ్రాం అధికారి వై అనసూయాదేవి, యూనిట్ 3 ప్రోగ్రాం అధికారి డి నాగమణి, దేశాభివృద్ధిలో యువత పాత్రపై ప్రసంగించారు. సెయింట్‌ఆన్స్ జూనియర్ కళాశాల ప్రోగ్రాం అధికారులు ఎ ఆదిలక్ష్మి, వై జెస్సీ విద్యార్థుల క్రమశిక్షణ గురించి, ప్రత్యేక సేవా కార్యక్రమాల ఆవశ్యకత గురించి ప్రసంగించారు. అనంతరం విద్యార్థి నాయకులు తులసి, కవిత, లక్ష్మీప్రియ, మాధురి, ఆశ, వాజిదా బేగం, సాయిప్రత్యూష, అరుణ, పద్మశ్రీ, అమృత, లావణ్య, ఇలేఖ్యల ఆధ్వర్యాన సామాజిక అంశాలపై ప్రత్యేక చర్చలు నిర్వహించారు.

సేవతోనే సంతృప్తి

విశాఖపట్నం : వాసవీ క్లబ్ వనిత కెసిజిఎఫ్ వైజాగ్ ఫెమినా మహిళా సభ్యుల ఆధ్వర్యంలో ద్వారకానగర్ 'వి' హోటల్ ప్రాంగణంలో 2018కి గాను వాసవీ క్లబ్ వనిత కెసిజిఎఫ్ వైజాగ్ ఫెమినా నూతన కార్యవర్గం ప్రమాణ స్వీకారాన్ని ఘనంగా నిర్వహించారు. 2018కి గాను సంస్థ అధ్యక్షురాలిగా వి నిర్మల, కార్యదర్శిగా కె పుష్ప, కోశాధికారిగా సిహెచ్ చందనలు ప్రమాణ స్వీకారం చేశారు. ప్రమాణ స్వీకార మహోత్సవానికి ముఖ్య అతిథిగా డిస్ట్రిక్ట్ గవర్నర్ ఎం రవికుమార్ హాజరై జ్యోతిని వెలిగించి కార్యక్రమాన్ని ప్రారంభించారు. అనంతరం ఎం రవికుమార్ ప్రసంగిస్తూ సేవతోనే ఆత్మసంతృప్తి కలుగుతుందని తద్వారా జీవితం సార్థకత అవుతుందన్నారు. ప్రతి ఒక్కరూ మంచి ఆశయంతో సేవా కార్యక్రమాలు నిర్వహించి సంస్థ ఉన్నతికి దోహదపడాలన్నారు. గౌరవ అతిథిగా విచ్చేసిన ఉపాధ్యక్షులు వాసవీక్లబ్ ఇంటర్నేషనల్ కొల్లూరు కామరాజు మాట్లాడారు. ప్రత్యేక ఆహ్వానితులుగా వి.మధుసూదన్, జి.వాసుదేవమూర్తి, సిహెచ్ శ్రీరామ్మూర్తి, విశిష్ట అతిథులుగా బి.వి.సావిత్రి, కె.సత్యలక్ష్మిలు పాల్గొని ప్రసంగించారు. నూతన కార్యవర్గంలో ప్రమాణ స్వీకారం చేసిన సంస్థ అధ్యక్ష, కార్యదర్శులు వి.నిర్మల, కె.పుష్పలు సంస్థ ఉన్నతికి కృషి చేస్తామని తెలుపుతూ అందరికీ కృతజ్ఞతలు తెలిపారు. కార్యక్రమంలో నూతన కార్యవర్గసభ్యులుగా ప్రమాణ స్వీకారం చేసిన సంస్థ అధ్యక్షురాలు వి.నిర్మల, కార్యదర్శి కె.పుష్ప, కోశాధికారి సిహెచ్.చందన, వీరితోపాటు పూర్వాధ్యక్షురాలు ఎం.వి.విజయలక్ష్మి, పూర్వ కార్యదర్శి బి.వి.పద్మావతి, పూర్వ కోశాధికారి వి.నిర్మల అధిక సంఖ్యలో మహిళా సభ్యులు తదితరులు పాల్గొన్నారు.

డబ్బులు చెల్లించినా అందని పట్టాలు

ప్రజాశక్తి-గాజువాక

గాజువాక హౌస్ కమిటీకి సంబంధించి జిఒ 301 కింద పూర్తి స్థాయిలో డబ్బులు చెల్లించినా నేటికీ పట్టాలివ్వడంలో ప్రభుత్వం తీవ్ర నిర్లక్ష్యం వహిస్తోంది. దీనికి ప్రధాన కారణం సర్వే సమయంలో, సర్వే అనంతరం అప్‌లోడ్ పనిని ఒక ప్రయివేటు ఏజెన్సీకి ప్రభుత్వం అప్పగించింది. వారు సర్వే పూర్తిచేసి రికార్డులను కంప్యూటరీకరించారు. తర్వాత ఆ ఏజెన్సీకి అనుకున్న ఒప్పందం ప్రకారం డబ్బులు చెల్లించకపోవడం, ప్రస్తుతం ఆర్‌డిఒ కార్యాలయంలో దీనికి సంబంధించిన రికార్డులు కంప్యూటరీకరించే సిబ్బంది లేకపోవడంతో డబ్బులు కట్టిన వారికి పట్టాలు నేటికీ అందలేదు. గడిచిన ఆరు నెలలుగా గాజువాక తహశీల్దార్ కార్యాలయం చుట్టూ తిరిగినా ఫలితం లేదు. మొత్తంగా 8,500 మంది దరఖాస్తు చేసుకుంటే 5,236 మందికి పట్టాలు పంపిణీ చేశారు. సరైన ఆధారాలు లేవని మరో 2500 పెండింగ్‌లో ఉంచారు. మరికొన్నింటిలో తప్పులు దొర్లాయి. 264 మందికి సంబంధించి అన్నీ సక్రమంగా ఉండి డబ్బులు చెల్లించినా పట్టాలివ్వలేదు. దీనిపై ప్రజాశక్తి కేసు స్టడీ చేయగా పలు విషయాలు వెల్లడయ్యాయి. బిసి రోడ్డుకు చెందిన దేవ రెసిడెన్సీ యజమాని సంపంగి సూరిబాబు జిఒ 301 కింద డబ్బులు చెల్లించి ఆరు నెలలు గడుస్తోంది. ఇంత వరకు ఆయనకు పట్టా మంజూరుచేయలేదు. రెవెన్యూ అధికారులు ఆలస్యం చేయడం వల్ల ఆయన ప్రతి ఆరు నెలలకు ఇంటి పన్ను రూ.60 వేలు (100 శాతం) చెల్లిస్తున్నారు. ప్రభుత్వం పట్టాను సకాలంలో మంజూరుచేస్తే అదే ఇంటి పన్ను రూ.28 వేలు మాత్రమే చెల్లించాల్సి ఉంటుంది. మణికంఠ యజమాని పాత గాజువాకలోని తన షాపింగ్‌కు ఇదేవిధంగా ఇంటి పన్నును చెల్లిస్తున్నారు. ఈ విధంగా 264 మంది బాధితులు పూర్తిస్థాయిలో డబ్బులు చెల్లించినప్పటికీ పట్టాలు రాక అధిక మొత్తంలో రెవెన్యూ రూపంలో డబ్బులు చెల్లించాల్సి వస్తోంది. ఇప్పటికైనా అధికారులు స్పందించి డబ్బులు చెల్లించిన వారికి పూర్తిస్థాయిలో పట్టాలు మంజూరుచేయాలని స్థానికులు కోరుతున్నారు.

జిఒ 301తో గాజువాక ప్రజలకు కష్టాలు

దీనిపై గాజువాక తహశీల్దార్ టి.వేణుగోపాల్‌ను వివరణ కోరగా తమ వద్ద పనులన్నీ పూర్తిచేసి, ఆర్‌డిఒ కార్యాలయానికి పంపామని తెలిపారు. అక్కడి నుంచి వచ్చిన వెంటనే పంపిణీ చేపడతామని చెప్పారు. పట్టాల్లో తప్పులకు సంబంధించి ఇప్పటికి 1200 దరఖాస్తులు స్వీకరించామని, వాటిని కూడా సరిచేస్తున్నామని తెలిపారు.



పోటీలను ప్రారంభిస్తున్న స్టీల్‌ప్లాంట్ డిపి కిషోర్‌చంద్రదాస్

వికలాంగ బాలలకు క్రీడా పోటీలు

ప్రజాశక్తి-ఉక్కునగరం

విశాఖ ఉక్కు కర్మాగారం (ఆర్‌ఐఎన్‌ఎల్) కార్పొరేట్ సోషల్ రెస్పాన్సిబిలిటీ (సిఎస్‌ఆర్) కార్యక్రమాల్లో భాగంగా విశాఖపట్నం, విజయనగరం జిల్లాలోని ప్రత్యేక పిల్లలకు కల్నల్ సికె.నాయుడు ఉక్కు స్టేడియంలో శనివారం క్రీడా పోటీలను నిర్వహించారు. పోటీల ప్రారంభ కార్యక్రమానికి కిషోర్‌చంద్రదాస్ ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. సాధారణ పిల్లలకు ఏ మాత్రమూ తీసిపోమని ప్రత్యేక పిల్లలు నిరూపించాలని సూచించారు. ఉక్కు యాజమాన్యం ప్రత్యేక పిల్లల కోసం అరుణోదయ పాఠశాలను ఏర్పాటుచేసి వారి అభివృద్ధికి కృషి చేస్తోందన్నారు. భవిష్యత్తులో వారి కోసం మరిన్ని సంక్షేమ కార్యక్రమాలను చేపడతామన్నారు. ఈ పోటీలకు విశాఖ, విజయనగరం జిల్లాల్లోని 12 పాఠశాలలకు చెందిన సుమారు 250 మంది పిల్లలు పాల్గొన్నారు. వీరిని వయసు వారీగా వివిధ కేటగిరీలుగా విభజించి పలు పోటీలను నిర్వహించారు. ఈ కార్యక్రమంలో స్టీల్‌ప్లాంట్ స్పోర్ట్స్ కమిటీ ఛైర్మన్, జిఎం(హెచ్‌ఆర్) ఆర్‌వి.రావు, డిజిఎం(సిఎస్‌ఆర్) జి.గాంధీ, గుర్తింపు యూనియన్ అధ్యక్షుడు గంధం వెంకటరావు, అధికారుల సంఘం ప్రధాన కార్యదర్శి కాటం శ్రీసత్యచంద్రరావు, ఉక్కు క్రీడావిభాగాధిపతి ఎంఎస్.కుమార్, ఎస్‌సి, ఎస్‌టి అసోసియేషన్ ప్రధాన కార్యదర్శి ఎం.అన్వేష్ పాల్గొన్నారు.

టిడిపి పాలన అవినీతిమయం : నాగిరెడ్డి

గాజువాక : టిడిపి పాలన అంతా అవినీతిమయమైందని వైసిపి గాజువాక నియోజకవర్గ సమన్వయకర్త తిప్పల నాగిరెడ్డి ఆరోపించారు. జివిఎంసి 65వ వార్డు పరిధి హరిజన జగ్గయ్యపాలెంలో శనివారం వైసిపి ఆధ్వర్యాన రచ్చబండ కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా పలు సమస్యలను స్థానికులనడిగి తెలుసుకున్నారు. రచ్చబండ అనంతరం ప్రజలనుద్దేశించి ఆయన మాట్లాడుతూ, ఎన్నికల సమయంలో గాజువాక నియోజకవర్గానికి సంబంధించి టిడిపి ఇచ్చిన ఏ ఒక్క హామీని కూడా అమలు చేయలేదన్నారు. జిఒ 301 ద్వారా హౌస్ కమిటీ బాధితులకు తీవ్ర అన్యాయం జరిగిందన్నారు. ఇప్పటికే ఈ జిఒ కింద దరఖాస్తు చేసుకున్న వారిలో చాలామందికి పట్టాలు రాలేదని తెలిపారు. ఎన్నికలకు ముందు హరిజన జగ్గయ్యపాలెంలో కల్యాణమండపం, శీలానగర్‌లో రైతుబజార్ ఏర్పాటుచేస్తామని హామీ ఇచ్చినా, ఎటువంటి పురోగతి లేదన్నారు. మరో ఏడాదిలో తమ పార్టీ అధికారంలోకి వచ్చిన వెంటనే హరిజన జగ్గయ్యపాలెంలో కల్యాణమండపం నిర్మిస్తామని చెప్పారు. ఎస్‌సి, ఎస్‌టి, బిసి, మైనార్టీలకు వైఎస్.రాజశేఖరరెడ్డి హయాంలోనే న్యాయం జరిగిందన్నారు. ఈ కార్యక్రమంలో వైసిపి నాయకులు ఎం.పరదేశి, సిహెచ్.చిట్టిబాబు, మొల్లి చిన్న, పెదిరెడ్ల ఈశ్వరరావు, సన్ని, పల్లా చినతల్లి, మీరాకుమారి పాల్గొన్నారు.

భద్రత పట్ల అవగాహన అవసరం

ఉక్కునగరం : కర్మాగారాల్లో భద్రత పట్ల నిరక్ష్యంగా వ్యహరించకూడదని, ఈ విషయంలో అవగాహన కార్యక్రమాలు అవసరమని డిజిఎం హెచ్‌ఆర్(ఐఆర్) కె.సంజీవరావు అన్నారు. శనివారం బిసి గేటు దగ్గర ఉక్కు సెంట్రల్ సేఫ్టీ కమిటీ ఆధ్వర్యాన భద్రతపై నిర్వహించిన అవగాహన కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. విధి నిర్వహణలో ప్రతి ఉద్యోగీ అప్రమత్తంగా ఉన్నప్పుడు ప్రమాదాలను నివారించవచ్చని చెప్పారు. ఉక్కు యాజమాన్యం భద్రతకు సంబంధించి అధిక ప్రాధాన్యత ఇస్తూ ఇప్పటికే అనేక అవగాహన కార్యక్రమాలు నిర్వహించిందన్నారు. విధులకు హాజరయ్యే వారు తప్పనిసరిగా హెల్మెట్‌తో పాటు సీట్ బెల్ట్ ధరించాలన్నారు. ఈ కార్యక్రమంలో భద్రతా అధికారి పి.కృష్ణమూర్తి, బలిరెడ్డి సత్యనారాయణ, నీలాపు వెంకటరమణ, గంగవరంగోపి, టివి.ప్రభాకర్, బొట్టా గురుమూర్తి తదితరులు పాల్గొన్నారు.

డిసిఐ ప్రభుత్వరంగంలోనే కొనసాగాలని 1455 ఓట్లు

ప్రజా బ్యాలెట్‌లో పాల్గొన్న వారికి సిఐటియు ధన్యవాదాలు

ప్రజాశక్తి-విశాఖపట్నం

డ్రెడ్జింగ్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియా (డిసిఐ) ప్రయివేటీకరణకు వ్యతిరేకంగా పెదగంట్యాడ జంక్షన్‌లో సిఐటియు పెదగంట్యాడ జోన్ కమిటీ ఆధ్వర్యాన నిర్వహించిన ప్రజా బ్యాలెట్‌లో 1489 ఓట్లు పడ్డాయి. శుక్రవారం నిర్వహించిన ప్రజాబ్యాలెట్లను శనివారం లెక్కించారు. అందులో డిసిఐ ప్రభుత్వ రంగంలో ఉంచాలని 1455 ఓట్లు, ప్రయివేటీకరించి ఫర్వాలేదు అని 15 ఓట్లు, చెల్లనివి 19 ఓట్లు వచ్చాయి. ఈ ఓట్లు లెక్కింపు సందర్భంగా సిఐటియు పెదగంట్యాడ జోన్ కమిటీ ప్రధాన కార్యదర్శి బి.ఢిల్లీరావు మాట్లాడుతూ, కేంద్ర ప్రభుత్వ నిర్ణయాన్ని వ్యతిరేకిస్తూ ఓట్లు ద్వారా నిరసన తెలియజేసిన ప్రజానీకానికి అభినందనలు తెలియజేశారు. ఇప్పటికైనా ప్రజా వ్యతిరేకత గ్రహించి డిసిఐని, స్టీల్‌ప్లాంట్‌ను ప్రభుత్వరంగంలోనే ఉంచి విశాఖ అభివృద్ధిని కాపాడాలని, కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలకు విజ్ఞప్తి చేశారు. లేకుంటే ప్రజాగ్రహానికి గురికాక తప్పదని హెచ్చరించారు. ఈ ఓట్లు లెక్కింపు కార్యక్రమంలో సిఐటియు నాయకులు కదిరి అప్పలరాజు, పాల అప్పలరెడ్డి, గణపతి, సిహెచ్.రాముడు, బి.సింహాచలం, బి.ఆనంద్, పులి అప్పలరెడ్డి, గొందేశి కుంచి, మొక్క చిన్నా, పిట్ట పైడిరెడ్డి తదితరులు పాల్గొన్నారు.



ప్రజా బ్యాలెట్లను లెక్కిస్తున్న సిఐటియు నాయకులు



జన్మభూమిలో మాట్లాడుతున్న ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాసమస్యల పరిష్కారానికే జన్మభూమి

ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు

ప్రజాశక్తి-కూర్మన్నపాలెం

ప్రజా సమస్యల పరిష్కారానికే జన్మభూమి నిర్వహిస్తున్నట్లు గాజువాక ఎమ్మెల్యే పల్లా శ్రీనివాసరావు అన్నారు. జివిఎంసి 56, 57 వార్డుల పరిధి అగనంపూడి నిర్వాసితకాలనీలో ఐదో విడత జన్మభూమి -మాఊరు కార్యక్రమాన్ని శనివారం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ప్రభుత్వ సంక్షేమ పథకాలను ప్రజలు సద్వినియోగం చేసుకోవాలని కోరారు. స్టీల్‌ప్లాంట్, ఫార్మాసిటీ, నిర్వాసితుల సమస్యల పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు తెలిపారు. ఉక్కు నిర్వాసితులకు పాత కర్ణవానిపాలెం దగ్గర పునరావాసం కల్పిస్తామని చెప్పారు. కొత్త రేషన్‌కార్డులు, పింఛన్లు మంజూరు చేశామన్నారు. ఈ కార్యక్రమంలో గాజువాక జోనల్ కమిషనర్ సోమన్నారాయణ, జన్మభూమి ప్రత్యేక అధికారి సకల రెడ్డి, ఎఎంహెచ్ఒ జయరామ్, ఇఇ నాగేశ్వరరావు వివిధ విభాగాల అధికారులు, టిడిపి నాయకులు తదితర్లు పాల్గొన్నారు.

ఉక్కునగరంలో షూటింగ్ సందడి

ప్రజాశక్తి-ఉక్కునగరం

ఉక్కునగరంలో షూటింగ్ సందడి నెలకొంది. ప్రముఖ ఫైట్ మాస్టర్ విజయ్ కుమారుడు రాహుల్ విజయ్ హీరోగా, కావ్యతాపర్ హీరోయిన్‌గా విఎస్ క్రియేటివ్ వర్క్స్ బ్యానర్‌పై రూపొందుతున్న చిత్ర షూటింగ్ ప్రస్తుతం విశాఖపట్నంలో సాగుతోంది. ఈ క్రమంలో చిత్ర యూనిట్ శనివారం ఉక్కునగరంలోని పలు ప్రాంతాల్లో హీరో, హీరోయిన్‌తో పాటు కమెడియన్లపై పలు సన్నివేశాలను చిత్రీకరించారు. హీరో నివాసం ఉంటున్న కాలనీగా ఉక్కునగరం ప్రాంతాన్ని చూపిస్తున్నామని యూనిట్ సభ్యులు తెలిపారు. ఈ షూటింగ్‌లో కమెడియన్లు సత్యంరాజేష్, తాగుబోతు రమేష్, జోష్ రవి, భద్రం, డార్లింగ్ దాస్ పాల్గొన్నారు. ఈ చిత్రానికి కెమెరామెన్‌గా శ్యామ్ కె.నాయుడు, ఆర్ట్ డైరెక్టర్‌గా చిన్నా వ్యవహరిస్తున్నారని యూనిట్ సభ్యులు చెప్పారు. ఈ చిత్రానికి రామ్ కొప్పుల డైరెక్టర్‌గా, దివ్య విజయ్ నిర్మాతగా ఉన్నారు. లవ్ అండ్ ఫ్యామిలీ ఎంటర్‌టైనర్‌గా రూపొందుతున్న ఈ చిత్రాన్ని వేసవిలో విడుదల చేయడానికి సన్నాహాలు చేస్తున్నామని యూనిట్ సభ్యులు తెలిపారు.



హీరో, హీరోయిన్ల సన్నివేశ చిత్రీకరణ

పిల్లలు ఆరోగ్యంగా ఉంటే ఉజ్వల భవిష్యత్తు

ప్రజాశక్తి-ఉక్కునగరం

పిల్లలు అన్ని విధాలా ఆరోగ్యవంతులుగా ఉన్నప్పుడే వారికి ఉజ్వల భవిష్యత్తు ఉంటుందని రాష్ట్ర మానవ వనరుల శాఖ మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. ఉక్కునగరం సెక్టార్-11లోని చైతన్య పబ్లిక్ స్కూల్ ప్రాంగణంలో శనివారం కేర్ ఎన్ గ్రో సంస్థ ఆధ్వర్యాన చైతన్య పబ్లిక్ స్కూల్, సృష్టి వరల్డ్ స్కూల్ 23వ వార్షికోత్సవం సందర్భంగా హెల్త్ ఇన్ ఎడ్యుకేషన్ పేరిట ఆల్ ఇండియా స్కూల్ హెల్త్ క్యాంపెయిన్ (హెల్త్ ఇన్ ఎడ్యుకేషన్, డిజిటల్ అండ్ ఫిజికల్ క్యాంపెయిన్)ను ఆయన ముఖ్య అతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ విద్యార్థులు ఆరోగ్య సమస్యలతో సతమతమవుతూ చదువులో వెనకబడిపోతున్నారని గుర్తించి పాఠశాలలోనే ప్రాథమిక ఆరోగ్య పరీక్షలు నిర్వహించి తల్లిదండ్రులకు పిల్లల సమస్యలు, నివారణ మార్గాలు చికిత్స పద్ధతులను వివరించేందుకు కేర్ ఎన్ గ్రో సంస్థ చేస్తోన్న ప్రయత్నం ప్రశంసనీయమన్నారు. హెల్త్ ఇన్ ఎడ్యుకేషన్ డిజిటల్ పేజెస్, కేర్ ఎన్ గ్రో డిజిటల్ హెల్త్ ఫామ్‌ను మంత్రి గంటా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా చైతన్య,సృష్టి వరల్డ్ స్కూల్ విద్యార్థులు ప్రదర్శించిన సాంస్కృతిక కార్యక్రమాలు అందర్నీ ఆకట్టుకున్నాయి. కార్యక్రమంలో ఎమ్మెల్యేలు బండారు సత్యనారాయణమూర్తి, పల్లా శ్రీనివాసరావు, పైడా విద్యా సంస్థల అధినేత పైడా కృష్ణ ప్రసాద్, కేర్ ఎన్ గ్రో సంస్థ వ్యవస్థాపకురాలు డాక్టర్ మేఘన కంభం, చైతన్య పబ్లిక్ స్కూల్ డైరెక్టర్ పి.సుశీలారాణి, ప్రిన్సిపల్ ఈ.చంద్రిక, శ్రిష్టి వరల్డ్ స్కూల్ ప్రిన్సిపల్ కె.శైలజ, 60 పాఠశాలల ప్రిన్సిపల్స్ పాల్గొన్నారు.



హెల్త్ క్యాంపెయిన్‌ను ప్రారంభిస్తున్న గంటా శ్రీనివాసరావు

సమస్యల పరిష్కారానికే జన్మభూమి నిర్వహణ

- మంత్రి గంటా శ్రీనివాసరావు - ఎన్నికల వాగ్దానాలను అమలు చేస్తామని వెల్లడి - పలుచోట్ల సమస్యలపై నిలదీత



చంద్రన్నబీమా బాండ్లను పంపిణీ చేస్తున్న మంత్రి గంటా

ప్రజాశక్తి-పద్మనాభం

ప్రజలు ఎదుర్కొంటున్న సమస్యలను క్షేత్రస్థాయిలోనే పరిష్కరించడానికే జన్మభూమి కార్యక్రమాన్ని ప్రభుత్వం అమలు చేస్తోందని రాష్ట్ర హెచ్ఆర్డి మంత్రి గంటా శ్రీనివాసరావు అన్నారు. మండలంలోని పొట్నూరు గ్రామంలో శనివారం నిర్వహించిన ఐదో విడత జన్మభూమి కార్యక్రమానికి ఆయన ముఖ్యఅతిథిగా హాజరై మాట్లాడారు. మండలంలోని పోట్నూరు గ్రామంలోని రోడ్డు అభివృద్ధికి ప్రత్యేక నిధుల మంజూరు చేశారు. పొట్నూరు గ్రామం నుంచి విజయనగరం జిల్లా కుమరాం గ్రామానికి రూ.52 లక్షలతో రోడ్డు నిర్మాణానికి ప్రత్యక నిధులు ఇచ్చామన్నారు. పొట్నూరు గ్రామంలో శ్రీకృష్ణదేవరాయులు వేసిన విజయస్థూపం ఈ గ్రామంలోనే ఉంది. దీన్ని టూరిజం శాఖకు అప్పగించడానికి ఏర్పాట్లు చేస్తున్నామని మంత్రి గంటా వివరించారు. రూ.19 కోట్లతో సమగ్ర మంచినీటి పథకాన్ని సమీపంలోని గోస్తనీ నదిలో ఏర్పాటు చేశామన్నారు. దీంతో 19 గ్రామాలకు తాగునీటి కొరత లేదనాన్నరు. అనంత పద్మనాభస్వామి కొండ రోడ్డు అభివృద్ధికి సుమారు రూ.6 కోట్లు వెచ్చించామన్నారు. దీంతో రోడ్డు పనులు పూర్తిగా చేపడుతామని వివరించారు. ఈ కార్యక్రమంలో ఎంపిపి కాళ్ల పద్మ, జెడ్పీటీసీ కె దామోదరరావు, జన్మభూమి కార్యక్రమ అధికారులు సిహెచ్ నిర్మలాదేవి, డి నాగేశ్వరావు, స్థానిక నేతలు ఎం నందేశ్వరావు, ఎం శ్రీను పాల్గొన్నారు.

తగరపువలస : జివిఎంసి భీమిలి జోన్ పరిధిలో పలు వార్డుల్లో ఐదవ విడత జన్మభూమి - మా వూరు గ్రామ సభలు శనివారం నిర్వహించారు. తగరపువలస 7, 8 వార్డుల్లో గ్రామ సభలు ఏర్పాటు చేశారు. ఈ సందర్భంగా లబ్ధిదారులకు పించన్లు, రేషన్ కార్డులు, చంద్రన్న బీమా అందజేశారు. జోనల్ కమిషనరు బంటు సన్యాసినాయుడు, టిడిపి డివిజన్ అధ్యక్షులు కొప్పల రమేష్, టిడిపి ఎస్ సి సెల్ అధ్యక్షులు రవ్వ వెంకటరావు చేతులమీదుగా లబ్ధిదారులకు రేషన్ కార్డులు తదితరాలు అందజేశారు. డాక్టర్ బి ఆర్ అంబేద్కర్ ఉన్నత పాఠశాల ఆవరణలో పలువురు మహిళలు వేసిన రంగవల్లులు ఎంతగానో ఆకట్టుకున్నాయి.

భీమిలిలో..

భీమిలిలోని 19, 20 వార్డుల్లో జన్మభూమి గ్రామసభలు జరిగాయి. ఈ కార్యక్రమాల్లో నోడల్ ఆఫీసర్ వెంకటరావు, టిడిపి డివిజన్ అధ్యక్షులు, కార్యదర్శులు గంటా నూకరాజు, గాడు సన్యాసినాయుడు, పార్టీ నాయకులు పెంటపల్లి యోగశ్వరరావు, గిడుతూరి శ్రీనివాస్ తదితరులు పాల్గొన్నారు.

మండలంలోని తాటితూరు, మజ్జివలస గ్రామాల్లో జన్మభూమి గ్రామ సభలు జరిగాయి. తహశీల్దార్ పివిఎల్ఎన్ గంగాధర్‌రావు, ఎంపిడిఒ కె హరి ప్రసాదరావు, వివిధ శాఖల అధికారులు, ఎంపిపి యరబాల కృష్ణవేణి, జెడ్పిటిసి సరగడ అప్పారావు ఆయా పంచాయతీల సర్పంచులు పల్లంటి రాజేశ్వరి, తుపాకుల ఆదిలక్ష్మి, టిడిపి మండల అధ్యక్షులు దంతులూరి అప్పల నరసింహరాజు తదితరులు పాల్గొన్నారు..

సమస్యలపై గ్రామస్తుల నిలదీత

ఆనందపురం : మండలంలోని గండిగుండం, గంభీరం, బి.పి కళ్లాలులో శనివారం 'జన్మభూమి – మావూరు' కార్యక్రమంలో సమస్యలపై అధికారులను గ్రామస్తులు నిలదీశారు. గండిగుండంలో ఎన్‌టిఆర్ గృహాలను 21 మంది అర్హులను పక్కనబెట్టి అధికార పార్టీ వారికే ఇచ్చుకున్నారని ఆరోపించారు. ఇందిరమ్మ కాలనీలో బర్రెల గ్రౌండ్‌కు స్థలం కేటాయించాలని, సత్తరవు చెక్‌పోస్ట్ సమీపంలో సంత నిర్వహణకు పర్మిషన్ ఇప్పించాలని విజ్ఞప్తి చేశారు. కార్యక్రమంలో సర్పంచి గండ్రెడ్డి శ్రీనివాసరావు తహశీల్దార్ కెవి ఈశ్వరరావు, మాజీ ఎంపిపి కోరాడ రాజబాబు, మాజీ సర్పంచి గండ్రెడ్డి సోంబాబు, నాయకులు బిఆర్‌బి నాయుడు పాల్గొన్నారు.

గంభీరంలో నిర్వహించిన కార్యక్రమంలో గంభీరం, బోయిపాలెం శ్మశానంలో షెడ్లు ఏర్పాటు చేయాలని గంభీరంలో క్వారీని ఐఐఎమ్‌కు కేటాయించిన నేపథ్యంలో కార్మికులకు నష్టపరిహారం చెల్లించలేదని నిలదీశారు. అర్హులైన వారికి ఇళ్ల స్థలాలు మంజూరు చేయాలని 50 మంది దరఖాస్తు చేసుకున్నారు. బోయిపాలెం నుంచి గంభీరం వరకు హైవేపై లైట్లు వేయించాలని కార్మికుల ఉపాధి కోసం క్వారీ కొండకు పర్మిషన్ కల్పించాలని అధికారులను కోరారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి బోయి అరుణకుమారి ఆధ్వర్యాన ఎంపిడిఒ బి అరుణశ్రీ వ్యవసాయ మార్కెట్ కమిటీ చైర్మన్ కోరాడ నాగభూషణరావు, రాష్ట్ర గిడ్డంగుల శాఖ డైరెక్టర్ బి మణిశంకర్ నాయుడు, మాజీ సర్పంచి వానపల్లి ముత్యాలరావు, రాంబాబు పాల్గొన్నారు.



అధికారులను నిలదీస్తున్న గ్రామస్తుడు

బి.పి కళ్లాలులో జరిగిన కార్యక్రమాలు మూడు విడతలుగా జన్మభూమిలో పెట్టిన దరఖాస్తులు నేటికి పరిష్కారం కాలేదని సుమారు 40 మంది వరకు రేషన్ కార్డులు ఇవ్వలేదని నిలదీశారు. పాఠశాలలో బిల్డింగ్ నిర్మాణానికి స్థలం కేటాయించాలని, ఇళ్లస్థళాలు మంజూరు చేయాలని పలు దరఖాస్తులు చేసుకున్నారు. ఈ కార్యక్రమంలో స్థానిక సర్పంచి బి ధనలక్ష్మి ఇఒపిఆర్‌డి రమణయ్య, కార్యదర్శి మాధవరావు, మాజీ సర్పంచి బి నాగరాజు నాయకులు బి గోవిందరావు, కె నాగరాజు తదితరులు పాల్గొన్నారు.



మాట్లాడుతున్న ప్రత్యేకాధికారి వసంతరాయుడు

ఇనాం భూసమస్య పరిష్కారానికి కృషి

ప్రజాశక్తి-పద్మనాభం

మండలంలోని పలు గ్రామాలలోని జన్మభూమి కార్యక్రమాలను శనివారం నిర్వహించారు. పొట్నూరు, కృష్ణాపురం, పెంట గ్రామాల్లో నిర్వహించిన గ్రామ సభల్లో నియోజకవర్గ జన్మభూమి అధికారి వసంతరాయుడి దృష్టికి స్థానిక రైతులు భూ సమస్యను తీసుకొచ్చారు. తమ వద్ద భూములకు సంబంధించి అన్ని ఆధారాలు ఉన్నప్పటికీ దేవుడుమాన్యంగా అధికారులు రికార్డులో చూపుతున్నారని ఆవేదన వ్యక్తం చేశారు. సంక్రాంతి తర్వాత భూదస్త్రాలను తీసుకొస్తే వాటిని పరిశీలించి, వాటికి పరిష్కార మార్గాన్ని పరిశీలిద్దాం అన్నారు. కార్యక్రమంలో ఎంపిపి కాళ్ల పద్మ, జెడ్పిటిసి కె దామోదరరావు పాల్గని మాట్లాడారు. గడిచిన రెండు సంవత్సరాల నుంచి స్థానిక మంత్రి గంటా సహకారంతో రూ.65 కోట్లు నిధులు వెచ్చించి అభివృద్ధి పనులు చేపట్టామన్నారు.

దీనిలో భాగంగా పద్మనాభం నుంచి నీలకుండీలు, పద్మనాభం నుంచి మహరాజుపేట వరకు రోడ్ల అభివృద్ధి పనులు చేశామన్నారు. గ్రామాలలో చంద్రన్న బాట కార్యక్రమం క్రింద సిసి రోడ్లు, పంచాయతీ భవనాలు, శ్మశానం అభివృద్ధికి చర్యలు తీసుకున్నామన్నారు. అంగన్‌వాడీ భవనాలు, పాఠశాలలో ప్రహరీలు, వంట గదులు, మరుగుదొడ్లు వంటి కార్యక్రమాలు జరిగాయన్నారు. ఈ కార్యక్రమంలో జన్మభూమి కె రమాదేవి, అధికారులు ఉమామహేశ్వరావు, హిమబిందు, రమేష్, నాయకులు అప్పలనాయుడు, బి శ్రీను, ఎం అప్పలరాజు, జి సూర్యనారాయణ తదిరులు పాల్గొన్నారు.

మద్యం తాగి వాహనం నడిపితే జైలు

ఆనందపురం : మద్యం తాగి వాహనం నడిపినట్లయితే జరిమానాతో పాటు జైలు శిక్ష విధించడం జరుగుతుందని స్థానిక సిఐ ఆర్ గోవిందరావు తెలిపారు. డ్రంకెన్ డ్రైవ్ కేసులో జరిమానాతో సరిపోయేదని ప్రస్తుతం రెండువేలు జరిమానాతో పాటు రెండు రోజుల జైలుశిక్ష కూడా ఉంటుందన్నారు. ఈ మేరకు శనివారం ఏడుగురు వాహనదారులు, డ్రంక్ అండ్ డ్రైవ్ కేసులు నమోదు చేసి జరిమానాతో పాటు జైలు శిక్ష విధించినట్లు ఆయన తెలిపారు.

గ్రీన్‌డేల్ స్కూల్‌లో సంక్రాంతి సంబరాలు

మధురవాడ : జివిఎంసి 57వ వార్డు పరిధిలోని గ్రీన్‌డేల్ స్కూల్‌లో సంక్రాంతి సందర్భంగా చిన్నారులకు ఆటల పోటీలను మంత్రి గంటా శ్రీనివాసరావు శనివారం ముఖ్యఅతిథిగా హాజరై ప్రారంభించారు. ఈ సందర్భంగా పాఠశాల మైదానంలో ఏర్పాటు చేసిన భోగి మంటలను వెలిగించారు. కైట్ ఫెస్టివల్‌లో భాగంగా గాలిపటాలను చిన్నారులతో పాటు ఎగురవేశారు. గ్రౌండ్‌లో ఏర్పాటు చేసిన బమ్మల కొలువులను తిలకించారు. హరిదాసుల వేషధారణలో ఉన్న విద్యార్థులను చూసి వారితో సంభాషించారు. అనంతరం ఆయన మాట్లాడుతూ భవిష్యత్ తరానికి సంక్రాంతి వంటి సాంప్రదాయ పండగల విశిష్టతను తెలియజేయాల్సిన ఆవశ్యకత ఉందన్నారు. కార్యక్రమాన్ని నిర్వహించిన పాఠశాల యాజమాన్యాన్ని అభినందించారు.



భోగి మంటను వెలిగిస్తున్న మంత్రి గంటా



కప్పస్తంభం ఆలింగనంలో ఎంపీ ముత్తంశెట్టి

అప్పన్న సేవలో ప్రముఖులు

సింహాచలం : శ్రీ వరాహలక్ష్మీనఅసింహ స్వామిని అనకాపల్లి ఎంపీ ముత్తంశెట్టి శ్రీనివాసరావు, రాష్ట్ర అటవీ శాఖ ఎండీ, అడిషనల్ పిసిసిఎఫ్ కె మల్లిఖార్జునరావు, యూపీఎస్సీ అండర్ సెక్రటరీ పుష్పలత, చెన్నై హైకోర్టు న్యాయమూర్తి ఎస్ భాస్కరన్ దంపతులు తదితరులు శనివారం దర్శించుకున్నారు. వీరికి ఆలయ సహాయ కార్యనిర్వాహణాధికారి ఆర్‌విఎస్ ప్రసాద్ పూలమాల వేసి ఆహ్వానం పలికారు. తొలుత కప్పస్తంభాన్ని ఆలింగనం చేసుకుని, బేడా మండప ప్రదక్షిణం చేసి, స్వామి వారి అంతరాలయంలో ప్రత్యేక పూజలుచేశారు. వారిని ఆలయాధికారులు స్వామి వారి శేషవస్త్రంతో సత్కరించి ప్రసాదాలను అందజేశారు.

ఎస్టీజాబితాలో చేర్చాలని వినతి

అచ్యుతాపురం : మత్స్యకారులకు గత ఎన్నికల్లో సిఎం చంద్రబాబు నాయుడు ఇచ్చిన హామీ మేరకు ఎస్‌టి జాబితాలో చేర్చాలని డిప్యూటీ తహశీల్దార్ నర్సింగరావుకు వైసిపి నాయకులు సిహెచ్ అప్పారావు, మెరుగు అప్పలనాయుడు, మెరుగు అప్పలరాజు, సూరాడ రాజమౌళి శనివారం వినతిపత్రం అందజేశారు.

ఎర్నికుమారికి ఎన్ని కష్టాలో..

- వేలిముద్ర పడక అందని పింఛను - ప్రతి నెలా ఇవే ఇబ్బందులు..

తగరపువలస : స్థానిక 7వ వార్డుకు చెందిన గుర్ల ఎర్నికుమారి (29) తన పదకొండవ ఏట పోలియో బారిన పడింది. తల్లిదండ్రులు ఎర్రయ్యమ్మ, సన్యాసిరావు ఈమెను బిఎ వరకు చదివించారు. 2010లో ఈమె బిఎ పూర్తిచేసింది. ఆమె చేసుకున్న విజ్ఞప్తుల మేరకు 2015 నుంచి ఈమెకు పింఛను అందుతోంది. వీరిది నిరుపేద కుటుంబం. తండ్రి ఊరూరా ఐస్ అమ్ముతూ కుటుంబాన్ని నెట్టుకొస్తున్నారు. తల్లి కూడా కూలి పని చేస్తుంది. ఇలా వుండగా ప్రతి నెలా పింఛను కోసం నిర్దేశిత ప్రాంతంలోకి వెళ్లి వేలి ముద్ర వేసి సంబంధిత సిబ్బంది నుంచి ఎర్నికుమారి పింఛను పొందుతూ ఉంటుంది. ఆ సమయంలో ట్రైసైకిల్‌పై వెళ్లే ఎర్నికుమారి చెల్లెలు సుజాత లేదా ఇతరుల సాయం కోరి పింఛను పొంది వస్తుంటుంది. స్థానిక 7వ వార్డు డాక్టరు బిఆర్ అంబేద్కర్ ఉన్నత పాఠశాల ఆవరణలో జరిగిన జన్మభూమి గ్రామ సభకు చెల్లెలు సాయంతో ట్రైసైకిల్‌పై వచ్చిన ఎర్నికుమారి తన వేలిముద్ర పడక పింఛను పొందక నిరాశలో వెనుతిరిగింది. ఇలా ఉండగా వృద్ధులు, వికలాంగులకు వారి సౌకార్యార్థం వారి వారి ఇళ్లకు వెళ్లి పింఛన్లు బట్వాడా చేయాలన్నది ప్రభుత్వ నిబంధన కాగా పింఛను బట్వాడా చేసే సిబ్బంది మాత్రం అందుకు భిన్నంగా పించన్లు ఇస్తున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు.



పింఛను అందక నిరాశతో వెనుదిరుగుతున్న ఎర్నికుమారి

'5కె రన్‌ను విజయవంతం చేయాలి'

పద్మనాభం : ప్రభుత్వ ఆదేశాల మేరకు 5కె రన్ కార్యక్రమాన్ని విజయవంతం చేయాలని స్థానిక మండల ప్రత్యేకాధికారి డి నాగేశ్వరావు అన్నారు. మండల కేంద్రమైన పద్మనాభం మండల పరిషత్ కార్యాలయంలోని ఎంపిడిఒ కార్యాలయంలో శనివారం ఏర్పాటు చేసిన సమావేశంలో ఆయన మాట్లాడారు. ఈ కార్యక్రమాన్ని ఆదివారం ఉదయం 6 గంటల నుంచి 7 గంటల వరకు ఈ కార్యక్రమాన్ని నిర్వహిస్తున్నామ తెలిపారు. కార్యక్రమంలో పద్మనాభం జిల్లాపరిషత్ పాఠశాల విద్యార్థులు, అధికారులు, జన్మభూమి కార్యక్రమంలో భాగంగా నిర్వహించాలన్నారు. ఈ కార్యక్రమాన్ని మండల కేంద్రం నుంచి బోని జంక్షన్ వరకు 5కె రన్‌ను ఏర్పాటు చేస్తామన్నారు. ఈ కార్యక్రమంలో అందరూ పాల్గని విజయవంతం చేయాలని కోరారు. ఈ సమావేశంలో స్థానిక ఎంపిడిఒ సిహెచ్ నిర్మల దేవి, ఎంఇఒ ఎస్ సూరిబాబు, రాజుబాబు తదితరులు పాల్గొన్నారు.

డిసిఐ ప్రయివేటీకరణ నిలిపివేయకుంటే పోరాటం ఉధృతం

సిఐటియు ఆలిండియా అధ్యక్షులు హేమలత

ప్రజాశక్తి- డాబాగార్డెన్స్

డిసిఐను ప్రయివేటీకరించాలన్న నిర్ణయాన్ని ఈ నెల 20లోపు ప్రభుత్వం వెనక్కు తీసుకోవాలని, లేనిపక్షంలో ఆందోళన ఉధృతం చేస్తామని సిఐటియు ఆలిండియా అధ్యక్షులు డాక్టర్ హేమలత హెచ్చరించారు. విశాఖ నగరంలోని సిహెచ్ కూడలిలో ఉద్యోగులు చేస్తున్న రిలే దీక్షా శిబిరం శనివారంతో ముగిసింది. ఈ సందర్భంగా జరిగిన సభలో ఆమె మాట్లాడుతూ, డిసిఐ ప్రయివేటీకరించాలన్న ప్రభుత్వ నిర్ణయంపై ఇటీవల నిర్వహించిన ప్రజాబ్యాలెట్‌లో 1,01,320 ఓట్లు పోలవ్వగా 1,00,090 ఓట్లు డిసిఐ ప్రయివేటీకరణకు వ్యతిరేకంగాను, 612 ఓట్లు మాత్రమే అనుకూలంగా వచ్చాయన్నారు. 618 ఓట్లు చెల్లలేదన్నారు. ప్రయివేటీకరణను ప్రజలు వ్యతిరేకిస్తున్నారని, ప్రజల గౌరవాన్ని ప్రభుత్వం కాపాడాల్సిన అవసరముందని తెలిపారు. బిజెపి ప్రభుత్వరంగ పరిశ్రమలను డిజిన్వెస్టుమెంట్ చేయడానికి ఏకంగా మంత్రివర్గాన్ని ఏర్పాటు చేసిందన్నారు. సేలం, దుర్గాపూర్ స్టీల్‌ప్లాంట్‌లు, బిఎస్ఎన్ఎల్, బ్యాంకింగ్, ఇన్సూరెన్స్ రంగాలను మొత్తంగా ప్రయివేటుపరం చేయడానికి పూనుకుందన్నారు. గిరిజన ప్రాంతాల్లో పరిశ్రమలు పెట్టడం వల్ల ఆ ప్రాంతాలు అభివృద్ధి చెందాయన్నారు. ఈ పరిశ్రమలు కేంద్ర ప్రభుత్వానికి పన్నులు, డివిడెంట్లు చెల్లిస్తున్నాయన్నారు. ప్రభుత్వరంగాన్ని ప్రయివేటుపరం చేయడమేనా బిజెపి దేశభక్తి అని ప్రశ్నించారు. మేకిన్ ఇండియా, సంవత్సరానికి 2కోట్ల ఉద్యోగాలు కల్పిస్తామని ఎన్నికల్లో ప్రకటించి ఉన్న ఉద్యోగాలు ఊడగొడుతున్నారన్నారు. ప్రభుత్వరంగమంటే ఎస్సీ, ఎస్టీలకు ఉద్యోగాలు వస్తాయని దేశ సార్వభౌమత్వం కాపాడబడుతుందని తెలిపారు. రైల్వే ప్రయివేటీకరణభాగంగా ఇప్పటికే విశాఖ, విజయవాడ, హైదరాబాద్, కోల్‌కత్తా, ముంబయి వంటి 43 రైల్వేస్టేషన్లను ప్రయివేటీకరణ చేశారన్నారు. రైల్వే ఇంజన్లు, బోగీలు తయారు చేయడం ప్రభుత్వరంగంలో జరుగుతుందని, వాటిని ప్రయివేటుపరం చేయడానికి ప్రభుత్వం కుట్ర చేస్తుందని పేర్కొన్నారు.

సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్.నర్సింగరావు మాట్లాడుతూ డిసిఐ పరిరక్షణకు ఉద్యోగులు చేస్తున్న పోరాటం, అఖిలపక్ష కార్మికసంఘాలు, రాజకీయపార్టీలు చేస్తున్న కృషి అభినందనీయమన్నారు. ప్రభుత్వం ఇప్పటికైన స్పందించకపోతే ఉద్యమాన్ని మరింత ఉధృతం చేస్తామని, నిరవధిక నిరాహార దీక్షలు చేస్తామని ప్రభుత్వానికి హెచ్చరించారు. ఎఫ్ఎస్‌యు జాతీయ నాయకులు మనోజ్‌యాదవ్, సిఐటియు నగర ప్రధానకార్యదర్శి ఎం.జగ్గునాయుడు, ఐఎన్‌టియుసి నాయకులు కె.ఈశ్వరరావు, ఎఐటియుసి నాయకులు మార్కెండేయులు, ఐఎఫ్‌టియు నాయకులు మల్లయ్య, ఢిపెన్స్ నాయకులు ఆర్.వెంటకరావు, డిసిఐ ఎంప్లాయీస్ యూనియన్ గౌరవాధ్యక్షులు విఎస్.పద్మనాభరాజు, జనసేన నాయకులు శివప్రసాద్, గోపి, స్టీల్‌ప్లాంట్ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు కెఎం.శ్రీనివాస్, ఇన్సూరెన్స్ నాయకులు ఆర్.రమణాచలం, ఐద్వా నగర కార్యదర్శి ఆర్ఎన్.మాధవి, పబ్లిక్ సెక్టార్ కోఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, డిసిఐ ఎంప్లాయీస్ యూనియన్ నాయకులు వి.నర్సింగరావు, వెంకటరావు, మూర్తి, డిసిఐ ఆఫీసర్స్ అపోసియేషన్ నాయకులు హనుమాన్ నాయక్ తదితరులు మాట్లాడారు. ఈ కార్యక్రమంలో సిఐటియు నగర నాయకులు డాక్టర్ బి.గంగారావు, పి.వెంకటరెడ్డి, జిఎస్.రాజేశ్వరరావు, బి.జగన్, పి.మణి, ఎం.సుబ్బారావు, డి.అప్పలరాజు, వై.రాజు, జి.అప్పలరాజు, డి.అప్పలరాజు, టి.పైడిరాజు, ఒ.అప్పారావు, జి.పోలేశ్వరరావు, ఎం.సూరీడు పాల్గొన్నారు.



సభలో మాట్లాడుతున్న జగ్గునాయుడు, వేదికపై హేమలత, కుమార్, పద్మనాభరాజు



'సేవ్ పబ్లిక్ సెక్టార్- డెవలప్ విశాఖ' పుస్తకాన్ని ఆవిష్కరిస్తున్న హేమలత, నర్సింగరావు, జగ్గునాయుడు, జ్యోతీశ్వరరావు

దేశం స్వయంసమృద్ధిలో ప్రభుత్వరంగ సంస్థల కీలకపాత్ర

'సేవ్ పబ్లిక్ సెక్టార్-డెవలప్ విశాఖ' పుస్తకావిష్కరణలో హేమలత

ప్రజాశక్తి- విశాఖపట్నం ప్రతినిధి

స్వాతంత్ర్యం వచ్చిన తర్వాత దేశం స్వయం సమృద్ధి సాధించడంలో ప్రభుత్వ రంగ సంస్థలు కీలకపాత్ర పోషించాయని, అటువంటి సంస్థలను నేడు బిజెపి ప్రభుత్వం ప్రయివేటుకు అప్పగించడానికి కుట్ర పన్నుతుందని సిఐటియు అఖిల భారత అధ్యక్షురాలు డాక్టర్ కె హేమలత పేర్కొన్నారు. శనివారం సిఐటియు నగర కార్యాలయంలో సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్.నర్సింగరావు (ఇంగ్లీషు బుక్) రాసిన 'సేవ్ పబ్లిక్ సెక్టార్-డెవలెప్ విశాఖ' పుస్తకాన్ని హేమలత ఆవిష్కరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రణాళికా సంఘం స్థానంలో వచ్చిన నీతిఆయోగ్ 77 ప్రభుత్వరంగ సంస్థలను అమ్మేయాలని సిఫారసు చేయగా, మోడీ ప్రభుత్వం అంగీకరించిందన్నారు. అందులో అయిల్, ఎలక్ట్రానిక్స్, స్టీల్‌ప్లాంట్ వంటి కంపెనీలు, బీమా సంస్థలు, రక్షణ, బ్యాంకింగ్, రైల్వే వంటి సంస్థలున్నాయన్నారు. దేశంలోని 400 పైగా రైల్వే స్టేషన్లను ప్రయివేటు చేయాలని నిర్ణయించారని, అందులో 43 స్టేషన్లకు టెండర్లు పిలిచారని, ఇప్పటికే మధ్యప్రదేశ్‌లోని హపీజ్‌నగర్ స్టేషన్‌ను ప్రయివేటుకు అప్పగించారని అన్నారు. ప్రభుత్వరంగ సంస్థల ప్రయివేటీకరణను అడ్డుకునేందుకు సిఐటియు చేస్తున్న పోరాటానికి దేశభక్తులు, దేశాన్ని ప్రేమించేవాళ్లు, అభివృద్ధి కాముకులు తమ మద్దతు తెలపాలని పిలుపునిచ్చారు. లేదంటే భారతదేశం భద్రతకే పెనుముప్పు ఏర్పడుతుందన్నారు. మేక్ ఇన్ ఇండియా పాలసీ దేశీయ పరిశ్రమల సామర్థ్యాన్ని దెబ్బతీస్తుందని అన్నారు. సిఐటియు రాష్ట్ర అధ్యక్షులు సి హెచ్.నర్సింగరావు మాట్లాడుతూ, ప్రయివేటుకు అప్పగించిన జింక్ పూర్తిగా మూతపడిందన్నారు. మోడీ ప్రభుత్వ విధానాలపై నగరంలోని బిజెపి నేతలను ప్రజలు ప్రశ్నిస్తున్నారన్నారు. ఇకనైనా బిజెపి ఈ విధానాలను మార్చుకోవాలన్నారు. స్టీల్‌ప్లాంట్‌కు గనులు ఇవ్వకుండా ఎండగట్టి ప్రయివేటుపరం చేయాలని చూస్తున్నారన్నారు. ఈ కార్యక్రమంలో పబ్లిక్ సెక్టార్ కో ఆర్డినేషన్ కమిటీ కన్వీనర్ ఎస్.జ్యోతీశ్వరరావు, సిఐటియు నగర ప్రధానకార్యదర్శి ఎం.జగ్గునాయుడు పాల్గొన్నారు.

రసవత్తరంగా సౌత్ జోన్ ఇంటర్ వర్సిటీ క్రికెట్ పోటీలు

ప్రజాశక్తి- మద్దిలపాలెం

ఆంధ్ర యూనివర్సిటీ అధ్వర్యాన రఘు ఇంజనీరింగ్ కాలేజి నిర్వహిస్తున్న సౌత్ జోన్ ఇంటర్ యూనివర్సిటీ క్రికెట్ పోటీలు ఆసక్తికరంగా జరుగుతున్నాయి. శనివారం విశాఖ, విజయనగంలలో తొమ్మిది క్రీడా మైదానాల్లో 19 మ్యాచ్‌లు జరిగాయి. క్రీడాకారులు చక్కటి ఆటతీరుతో ఆకట్టుకుంటున్నారు. రఘు ఇంజనీరింగ్ కాలేజి గ్రౌండ్‌లో కాకినాడ జెఎన్‌టియు, ఆచార్య నాగార్జున అగ్రికల్చర్ యూనివర్సిటీలు జరగాల్సిన పోటీలో నాగార్జున అగ్రికల్చర్ యూనివర్సిటీ జట్టు హాజరుకాలేక పోవడంతో కాకినాడ జెఎన్‌టియు జట్టుకు వాకోవర్ విజయాన్ని ప్రకటించారు. రెండో మ్యాచ్‌లో ఆదికవి నన్నయ యూనివర్సిటీ జట్టుపై మచిలీ పట్నం కృష్ణ యూనివర్సిటీ జట్టు 107 పరుగులు తేడాతో విజయం సాధించింది. మూడో మ్యాచ్‌లో ఎస్‌సిఎస్‌విఎం యూనివర్సిటీపై పిఇఎస్ యూనివర్సిటీ జట్టు 18 పరుగులు ఆధిక్యంతో గెలుపొందింది.

ఎంవిజిఆర్ గ్రౌండ్‌లో మంగుళూర్ యూనివర్సిటీ, అన్నా యూనివర్సిటీలు తలపడగా అన్నా యూనివర్సిటీ జట్టు 2 వికెట్ల తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో యూనివర్సిటీ ఆఫ్ కరీంనగర్, గుల్బర్గా యూనివర్సిటీలు పోటీపడగా గుల్బర్గా యూనివర్సిటీ జట్టు 84 పరుగుల ఆధిక్యంతో విజయం సాధించింది. విజయనగరం జెఎన్‌టియులో జరిగిన మ్యాచ్‌లో కామరాజ్, రాయలసీమ యూనివర్సిటీలు తలపడగా కామరాజ్ జట్టు 5 వికెట్లు తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో యోగివేమన యూనివర్సిటీపై ఉస్మానియా జట్టు 79 పరుగులు ఆధిక్యంతో గెలుపొందింది. విజ్జి గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో ఆచార్య నాగార్జునపై చెన్నై క్రిసెంట్ యూనివర్సిటీ 7 వికెట్లు తేడాతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో అలగప్పా యూనివర్సిటీపై షిమోగ కువేంపు యూనివర్సిటీ మూడు వికెట్ల తేడాతో విజయం సాధించింది. ఎంఆర్ కాలేజి గ్రౌండ్‌లో బెంగుళూర్ యూనివర్సిటీపై యూనివర్సిటీ ఆఫ్ మైసూర్ 46 పరుగుల ఆధిక్యంతో గెలిచింది. మరో మ్యాచ్‌లో కర్ణాటక యూనివర్సిటీపై యూనివర్సిటీ ఆఫ్ కాలికట్ జట్టు 6 వికెట్లు తేడాతో విజయం సాధించింది. జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో బెల్లారి విఎస్‌కె యూనివర్సిటీ జట్టుపై విజ్ఞాన్ వర్సిటీ 78 పరుగులు ఆధిక్యంతో గెలుపొందింది. మరో మ్యాచ్‌లో యూనివర్సిటీ ఆఫ్ అగ్రికల్చరల్ షిమోగపై భారత్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ తమిళనాడు జట్టు 115 పరుగుల తేడాతో భారీ విజయం సాధించింది. స్టీల్‌ప్లాంట్-2 గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో రాణి చెన్నమ్మ జట్టుపై అన్నామలై యూనివర్సిటీ జట్టు 3 వికెట్ల తేడాతో గెలిచింది. మరో మ్యాచ్‌లో భారతీయార్ జట్టుపై ఎస్‌వి. యూనివర్సిటీ జట్టు 2 వికెట్ల తేడాతో విజయం సాధించింది. జింక్ గ్రౌండ్‌లో జరిగిన మ్యాచ్‌లో చెన్నై సవిత యూనివర్సిటీ జట్టుపై బెంగుళూర్ అమృత విశ్వవిద్యాపీఠ్ 5 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో దామోదరం సంజీవయ్య జాతీయ లా యూనివర్సిటీపై డాక్టర్ ఎంజిఆర్ ఎడ్యుకేషనల్ అండ్ రిసెర్చ్ యూనివర్సిటీ జట్టు 44 పరుగుల తేడాతో విజయం సాధించింది. గీతం యూనివర్సిటీ గ్రౌండ్స్‌లో జరిగిన మ్యాచ్‌లో కాకతీయ జట్టుపై కొట్టాయాం మహాత్మాగాంధీ యూనివర్సిటీ జట్టు 8 వికెట్ల తేడాతో విజయం సాధించింది. మరో మ్యాచ్‌లో గీతం యూనివర్సిటీపై విక్రమ్ సింహపురి జట్టు ఏడు పరుగుల తేడాతో విజయాన్ని అందుకుంది.